V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా..

సోమవారం

15-12-2025

సంపుటి : 01 | సంచిక : 154 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# నేను బీఆర్ఎస్ వీడటానికి హరీశ్‌రావు కారణం కాదు

- రాజశేఖర్ రెడ్డి ఆహ్వానిస్తే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లా
- హరీష్ రావు రాజకీయం వేరు, జగ్గారెడ్డి రాజకీయం వేరు
- కవిత కేసీఆర్ కూతురు కాబట్టే లీడర్ అయ్యింది
- ఇప్పటికైనా ఈ ఆరోపణలు మానుకో కవితపై టీపీసీసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తాను బీఆర్ఎస్ పార్టీలో నుంచి బయటకు రావడానికి హరీశ్‌రావు కారణమని కవిత చేసిన ఆరోపణలను ఖండించారు. కవిత చేసిన ఆరోపణలు నిజం లేదని స్పష్టం చేశారు. ఆదివారం గాంధీ భవన్ లొ ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను హరీశ్‌రావుపై కోపంతో కాంగ్రెస్‌లోకి రాలేదని తెలిపారు. నా రాజకీయ భవిష్యత్ బాగుండాలని పార్టీ మారానన్నారు. మొదటి నుంచి నాకు, హరీష్ రావుకి ఎలాంటి శత్రుత్వం లేదన్నారు. ఆయన రాజకీయాలు వేరు, నా రాజకీయ వేరు అని జగ్గారెడ్డి అన్నారు. నా పార్టీ మార్పుపై కవిత తప్పుడు స్టేట్‌మెంట్స్ ఇస్తుందని మీ కుటుంబ పంచాయతీ లొ నన్ను లాగోదాన్నారు. కేసీఆర్ లేకుంటే అసలు కవిత లేదన్నారు. ఎప్పటికైనా ఆమె కేసీఆర్ కూతురుగానే గుర్తింపు ఉంటుందన్నారు. ఇకపై కవిత అభిమాన సంఘాలు నాకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో పెట్టడం ఆపేయాలని ,చిల్లర ట్రిక్స్ చేయొద్దు అని జగ్గారెడ్డి హెచ్చరించారు. తాను కాంగ్రెస్‌లోకి రావడానికి వైఎస్ఆర్ కారణమని జగ్గారెడ్డి తెలిపారు.

సదాశివపేట మున్సిపల్ ఎన్నికల్లో నా పని తీరు నచ్చి రాజశేఖర్ రెడ్డి నన్ను పార్టీలోకి ఆహ్వానించారని తాను పార్టీలో చేరితే సంగారెడ్డి జిల్లాకు ఐఐటీ, ముంబై హైవేకు ఫోర్ వే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కంది ఐఐటీ కి పునాది వేసింది వైఎస్సార్ అని తెలిపారు. ఐఐటీ కోసం రైతులు ఇచ్చిన భూములకు ఊహించని సహాయం చేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో నాకు, హరీష్ రావుకు ఎప్పుడూ వార్ నడుస్తూనే ఉంటుంది. ఇకపై కవిత ఇతరుల గురించి మాట్లాడటం కంటే..ముందు తన కుటుంబ రాజకీయాల గురించి ఆలోచిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. సీఎం అయితా అని ఎవరైనా తనకు నవ్వొస్తుందని అన్నారు. నేను కొంత డిస్ట్రబ్ అయ్యానని జగ్గారెడ్డి తెలిపారు. అందుకే సంగారెడ్డి కార్యక్రమం లొ ఎవరి ఫొటోలు వద్దు, రాహుల్ గాంధీ ఫొటో ఒక్కటే పెట్టాలని చెప్పానని పేర్కొన్నారు. అన్నీ ఇప్పుడే చెప్పను అని సమయం వచ్చినప్పుడు చెప్తానని అన్నారు. ఎవరి వల్ల డిస్ట్రబ్ అయ్యాననేది మే నెలలో చెబుతానని ప్రకటించారు. నేను డిసైడ్ అయ్యాక వెనక్కి రాను, ముందుకెళ్తా అని స్పష్టం చేశారు. ఇక గత కొద్దిరోజులగా ప్రచారం జరుగుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ పదవిపై కూడా తన ఆసక్తి లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## శుద్ధ్ విలాస్ ప్యూర్ వెజ్ రెస్టారెంటును ప్రారంభించిన హీరో శ్రీ విష్ణు



**విశ్వంభర, హైదరాబాద్ :** భాగ్యనగర భోజన ప్రియులకు పసందైన వంటకాలను అందించేందుకు సరికొత్త రెస్టారెంట్ అందుబాటులోనికి వచ్చింది. మల్కాజ్గిరి లో నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధ్ విలాస్ ప్యూర్ వెజిటేరియన్ రెస్టారెంట్‌ను యువ కథానాయకుడు శ్రీ విష్ణు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు తో పాటు.. నిర్వాహకులు శశికాంత్ శ్రీరామ్, ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల, కోన వెంకట్, మల్కాజ్‌గిరి బ్రాంచ్ భాగస్వాములు రాజీవ్, రాజా శేఖర్, హుస్సేన్, వెంకట్ మార్తాండ్ పాల్గొన్నారు.

నేటి ఆధునిక జీవనశైలికి తగిన విధంగా వంటకాలు అందించడం అభినందనీయమని సినీ కథానాయకుడు శ్రీ విష్ణు అన్నారు. నగరంలో ప్యూర్ వెజిటేరియన్ రెస్టారెంట్లు చాలా అరుదుగా ఉన్నాయని... మంచి రుచికరమైన శాఖాహార వంటకాలను అందించేందుకు రెస్టారెంట్ ను అందుబాటులోనికి తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

హైదరాబాద్ బోజన ప్రియులకు వైవిధ్యమైన రుచుల ద్వారా మనోహరన్ని అందిస్తోంది. ప్రజలు ఎంతో ఇష్టంగా ఆస్వాదించే శాకాహారంతో విభిన్న రుచులతో బెస్ట్ క్వాలిటీ అండ్ క్వాంటిటీ తో అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. మా సంస్థ లో పనిచేస్తున ఉద్యోగులకు ఉపాధి కల్పన పెంచుతూ మంచి రుచి, నాణ్యమైన వంటకాలు ప్రజలు ఎపుడూ అందిస్తూ అని మరిన్ని శాఖలు పెట్టి ఇలాగే ముందుకు సాగుతాం అని కూడా తెలిపారు.

## బాల భవన్‌ను పరిశీలించిన కవిత



**విశ్వంభర, నాంపల్లి :** నాంపల్లి నియోజకవర్గం పబ్లిక్ గార్డెన్స్ లోని జవహర్ బాల భవన్ ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బాల్ భవన్ లో అప్పట్లో అనేక కార్యక్రమాలు జరుగుతుండేవి, అలాంటి ఈ బాల్ భవన్‌కు గత 12 ఏండ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పిల్లలను ఇక్కడకు కంటిన్యూగా తెస్తే వాళ్లకు రిలాక్సేషన్ ఉంటుందని పేర్కొన్నారు. నగరంలో చాలా ప్రైవేట్ స్కూళ్లకు గ్రౌండ్స్ లేవు, ఆ స్కూళ్లలోని పిల్లలకు ఇక్కడ మంచి రిలాక్సేషన్ ఉంటుంది తెలిపారు. విద్యార్థులుకు యాక్టివిటీస్ తో నాలెడ్జ్ పెరుగుతుంది, ముఖ్యమంత్రి గారే విద్యా శాఖ మంత్రి కావటం మన ఖర్మ, ఆయనకు దీన్ని పట్టించుకునే సమయమే లేదు ఎద్దేవ చేశారు. బాల్ భవన్ లో 14 మంది డిప్యూటేషన్ మీద వచ్చిన స్టాఫ్ మాత్రమే ఉన్నారు, ఇప్పటి వరకు బాల్ భవన్ కు రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. బాల్ భవన్‌కు నిధులు ఇచ్చే వరకు జాగృతి పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# ట్రంప్ పై పోరాటం

**అనేక అంశాలపై వివిధ రూపాల్లో పోరాటం**



**విశ్వంభర, డెస్క్ :** ట్రంప్ విధానాలను గట్టిగా ప్రతిఘటించాలని సెనెటర్లు చేయాలని నిర్ణయించుకున్నారు. వర్క్ పర్మిట్‌లో మార్పులను సవాల్ చేసిన 10 మంది అమెరికా సెనేటర్లు హెచ్1బీ వీసా ఫీజు పెంపుపై 20 రాష్ట్రాల్లో న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించారు. భారత్‌పై 50శాతం సుంకాలను సవాల్ చేస్తూ అమెరికా ప్రతినిధుల సభలో ప్రతిపక్ష డెమాక్రటిక్ సభ్యులు తీర్మానం ప్రతిపాదించారు. విదేశీ ఉద్యోగులు, వస్తువులపై ఎడాపెడా ఆంక్షలు, సుంకాలు విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఆ దేశంలోని కాంగ్రెస్ సభ్యులు తిరుగుబాటు మొదలుపెట్టారు. హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఉన్న ఆటోమెటిక్ వర్క్ పర్మిట్ రెన్యూవల్ అవకాశాన్ని ట్రంప్ ప్రభుత్వం గత అక్టోబరు 30న రద్దు చేసింది. శరణార్థుల జీవిత భాగస్వాములతోపాటు కొన్ని రకాల హెచ్1బీ వీసాదారుల విషయంలో యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈ నిర్ణయం తీసుకుంది. అంతకుముందు హెచ్1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు వర్క్ పర్మిట్ రెన్యూవల్ కోసం చట్టబద్ధంగా గడువులోపు దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి దర్యాప్తు, పరిశీలనలు లేకుండా రెన్యూవల్ అయ్యేది. ఈ విధానాన్ని ట్రంప్ ప్రభుత్వం రద్దుచేసింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాలిఫోర్నియా సెనేటర్ అలెక్స్ పదిల్లా, మరో 9మంది కలిసి సెనేట్ (ఎగువసభ)లో కాంగ్రెషనల్ రివ్యూ యాక్ట్ (సీఆర్ఏ) తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం అధ్యక్షుడి నిర్ణయాలను సమీక్షించే అధికారం సభకు ఉంటుంది. అధ్యక్షుడి నిర్ణయం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారింది. దేశానికి ఎంతో సేవ చేస్తున్న ఉద్యోగులు నాశనమవుతున్నారు' అని అలెక్స్ పదిల్లా పేర్కొన్నారు.

**ఉచిత వైద్య శిబిరం, అందరూ**

## సద్వినియోగం చేసుకోవాలి

**- చిలుక మధుర ఉపేందర్ రెడ్డి**




**విశ్వంభర, ఎల్బీనగర్ :** అగర్వాల్ సమాజ్, బద్రి విశాల్ పన్నాలాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ వాసవి కాలనీ నివాసితులు సంక్షేమ సంఘం భవన్ లో ఉచిత మెగా మెడికల్ క్యాంపు కార్యక్రమానికి అతిథిగా సంఘ సేవకులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉచిత హెల్త్ క్యాంప్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తు చేశారు.సేవే లక్ష్యంగా పనిచేస్తున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**డాక్టర్ విజయభాస్కర్‌కు**

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**విశ్వంభర, మలక్ పేట్ :** హైదరాబాద్ జిల్లాలోని ఖైరతాబాద్ లో గల వాసవి క్లబ్ ఆదివారం డాక్టర్ ఎస్ విజయభాస్కర్ కు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ పూర్వ అధ్యక్షులు కూర రఘువీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ విజయభాస్కర్ సాహిత్య సామాజిక విద్య రంగాలలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానించినట్లు ఆయన తెలిపారు.డాక్టర్ విజయభాస్కర్ తెలుగు సాహిత్యంలో అనేక పుస్తకాలను వెలువరించారని పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా చక్రపాణి వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.హైదరాబాద్ జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు డాక్టర్ విజయభాస్కర్ కు రాష్ట్రస్థాయి అవార్డు రావడం పట్ల అభినందనలు తెలిపారు.




# ఫుట్‌బాల్ మ్యాచ్ పేరుతో రూ.10 కోట్లు వృథా: కవిత




**విశ్వంభర, హైదరాబాద్ :** జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా హైదరాబాదు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. గంటపాటు వినోదం కోసం ఫుట్‌బాల్ మ్యాచ్ నిర్వహించి రూ.10 కోట్లు ఖర్చు చేశారని, ఆ డబ్బు సింగరేణి నిధుల నుంచే వెళ్లిందని ఆరోపించారు. ఈ మ్యాచ్ వల్ల తెలంగాణ ప్రజలకు ఏం ప్రయోజనం కలిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణి నిధులను కాంగ్రెస్ పార్టీ తన పార్టీ ఫండ్ నుంచి తిరిగి చెల్లించాలన్నారు. రాహుల్ గాంధీ చిక్కడపల్లి లైబ్రరీకి రాకుండా మ్యాచ్ కోసం స్టేడియానికి రావడం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. హైదరాబాదులో డివిజన్ల విభజన అశాస్త్రీయంగా జరిగిందని, ఒకే పార్టీకి లాభం చేకూర్చేలా చేశారన్న ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా క్షీణించిందని, బస్సుల సంఖ్య భారీగా తగ్గడంతో ట్రాఫిక్ పెరిగిందన్నారు. డ్రైనేజీ, మంచినీటి సమస్యలు, స్ట్రీట్‌డాగ్స్ దాడులు, డ్రగ్స్, క్రైమ్ పెరుగుదలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నగర పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్

**జన జాగృతి ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు ఉషారాణి**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని జన జాగృతి ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి అన్నారు . ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ జై భీమ్ ఆర్ట్ అసోసియేషన్ రాజీవ్ గృహకల్ప కుంట్లూరులో అంబేద్కర్ మహనీయునికి కృతజ్ఞతాపూర్వకంగా నిత్య జ్ఞానమాలలో రెండో ఆదివారములో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జన జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజనులకు, సామాజిక చరిత్రను నిర్మించి వారి విముక్తికి బాటలు వేసిన మహనీయుడని అన్నారు.

అంటరానితనం, సామాజిక వివక్షను వ్యతిరేకించారని, దళితులకు రాజకీయ హక్కులు కల్పించాలని సామాజిక న్యాయం సాధించాలని కృషి చేశారు అని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం భారతదేశంలోని ప్రజలందరికీ సమానత్వం, న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఆర్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వినోద్,ప్రధాన కార్యదర్శి మంచాల మారయ్య , కోశాధికారి నల్ల యాదయ్య, ఈసీ మెంబర్ సత్యనారాయణ, ఎండి రసూల్ , అడ్వకేట్ పనికర రాజుకృష్ణ , బాకీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం




**విశ్వంభర, సరూర్ నగర్ :** చిత్రా లేఅవుట్ లో చిత్రా లేఅవుట్ ఉమెన్స్ వాకర్క్ క్లబ్ , లైన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ హైట్స్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలకు నడక పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం పోచంపల్లి సబితా ఇంద్రాసేనా రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమం అనంతర సీనియర్ డాక్టర్ రావు నడక చేయవలసిన విధానాలు దానివలన ప్రయోజనాలు వివరించారు, సభ్యుల అనుమానాలు నివృత్తి చేశారు. కార్యక్రమం లో కాలనీ వాకర్ సభ్యులు జ్యోతి, కవితా రెడ్డి, వనజ రెడ్డి, రామేశ్వర, విజయలక్ష్మీ, పరిమళ, రాజేశ్వరి, సుమతి, లక్ష్మి, హరిని , ఇతర కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## రాంనగర్‌లో బొల్లెం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, రాంనగర్ :** రాంనగర్‌లో సీనియర్ జర్నలిస్టు బొల్లెం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సన్నిహితులు, తోటి జర్నలిస్టుల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లం శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## అంబర్ పేట జోన్ కెమిస్ట్రీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక




**విశ్వంభర, అంబర్ పేట :** అంబర్ పేట జోన్ కెమిస్ట్రీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేసన్ గౌరవ శాశ్వత అధ్యక్షులుగా కె. వెంకట రమణారెడ్డి, అధ్యక్షులుగా నంగునూరి రమేష్, ప్రధానకార్యదర్శిగా రామాకాంత్, కోశాధికారిగా డి.హనుమంతరావు, భోగ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కిషోర్, కార్యవర్గ సభ్యులుగా పూర్ణచందర్, ఎం. విశ్వనాథం ఎన్నికయ్యారు. బహిరంగంగా మెడికల్ షాపుల వద్ద డిస్కౌంట్ బోర్డులను తీసివేయాలని కోరుతూ అసోసియేషన్ ఏక గ్రీవ తీర్మానం చేసిందని గౌరవ అధ్యక్షుడు కె. వెంకట రమణారెడ్డి తెలిపారు. మెడికల్ షాపుల వద్ద ఒక్కొక్కరు ఒకో విధంగా డిస్కౌంట్ బోర్డులు పెడుతుండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని, అందువల్ల ప్రతి ఒక్క షాపు యజమానికి డిస్కౌంట్ బోర్డులను తీసివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆర్య వైశ్య మహిళ సోదరీమణులకు అండగా ఉంటా..

- ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఆర్య వైశ్య మహిళ సోదరీమణులకు అండగా ఉంటా అని టి పీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం చందానగర్ లో పబ్బమల్లేష్ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వెంకటేశ్వర స్వామి కల్యాణం కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఐవీఎఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ రామ్ దాస్ అగర్వాల్ స్థాపించిన ఐవీఎఫ్ ను అన్ని విధాల ముందుకు తీసుకు వెళతామని, దేశంలోని వైశ్యులను ఏకతాటి పై నడిపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి వైశ్యుల మన్ననలు పొందిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రమాణ స్వీకారం లో మహిళలు అత్యధికంగా పదవులు పొంది ప్రమాణ స్వీకారం చేయడం సంతోషదాయకం అని అన్నారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పాసైన వైశ్య విద్యార్థులకు లక్ష రూపాయలను అందజేయడం, మహిళల చైతన్యం కోసం వివిధ మహిళా కార్యక్రమాల సంక్రాంతి ముగ్గుల పోటీ, వుమెన్స్ డే, మదర్స్ డే, గోరింటాకు సంబరాలు, కార్తీక వనభోజనాలు, తీర్థయాత్రలు నిర్వహిస్తుంది అని అన్నారు. ఐవీఎఫ్ న్యూ ఢిల్లీ మహిళా విభాగంలో కీలక పదవులు నిర్వహించిన రేఖ గుప్తా ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఐవీఎఫ్ కు గర్వకారణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో శేరిలింగం పల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ , రఘునాథ్ రెడ్డి, మాదాపూర్ ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్ , ఐవోప తెలంగాణ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.



www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
సోమవారం
15-12-2025
సంపుటి : 01 | సంచిక : 154 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## ఆస్ట్రేలియాలో ఉగ్ర దాడి

- 11 మంది దుర్మరణం
- 29 మందికి గాయాలు
- భద్రతను మరింత కట్టుదిట్టం చేసిన ఆస్ట్రేలియా ప్రభుత్వం
- తీవ్రంగా ఖండించిన ప్రధాని మోదీ



5

## భాజపా అధ్యక్షుడిగా నితిన్ నబీన్

- నితిన్‌కు మోడీ అభినందనలు
- బాంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నితిన్ వరుసగా నాలుగు సార్లు గేలుపు
- కష్టపడి పనిచేసే కార్యకర్తగా నితిన్ నబీన్ మంచి గుర్తింపు

5





"ఓటు చోరీ" కి మోడీ, షాల

# ఉమ్మడి కుట్ర

### సర్కారుతో ఎన్నికల సంఘం కుమ్మక్కు

- మోడీని గద్దె దించాలి
- బిహార్ పది వేలు పెంచితే కమిషన్ నోరు మెదపలేదు
- సత్యమే కంటే ముఖ్యం, దానిదే అంతిమ విజయం
- రాహుల్ గాంధీ



**విశ్వంభర, న్యూ ఢిల్లీ :** రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ మహాధర్నా రాహుల్ గాంధీ హాజరు. నరేంద్ర మోదీ, అమిత్‌షా లు ఉమ్మడిగా కుట్రతో ఓట్ చోరీకి పాల్పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ విషయం అందరికీ తెలుసని అన్నారు. ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని ఆరోపించారు. ఓట్ చోర్‌గద్దీ ఛోడ్ పేరు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆదివారం నిర్వహించిన మహా ధర్నాలో పాల్గొన్న రాహుల్ గాంధీ, ఆదివారం పలు వ్యాఖ్యలు చేశారు.

"మోదీ, అమిత్ షా ఓట్ చోరీకి పాల్పడుతున్నారని దేశంలోని ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. హరియాణా ఎన్నికల్లో ఓట్ చోరీ జరిగిందన్నారు. యూపీకి చెందిన బీజేపీ నేతకు హరియాణాలోనూ ఓటు ఉందని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలోని అక్రమాలపై ఈసీని ప్రశ్నిస్తే జవాబు ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి బీజేపీ కోసం మాత్రమే పనిచేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

విశ్వం సత్యాన్ని కాదు శక్తిని చూస్తుంది. ఎవరి దగ్గర శక్తి ఉంటే వారినే గుర్తిస్తుంది. ఇది మోహన్ భాగవత్ ఆలోచన. ఆర్.ఎస్.ఎస్. సిద్ధాంతం. మా సిద్ధాంతం, హిందుస్థాన్ సిద్ధాంతం, హిందూధర్మం సిద్ధాంతం, ప్రపంచంలోని అన్నిధర్మాల సిద్ధాంతాలు సత్యమే అన్నింటి కంటే ముఖ్యమని చెబుతాయన్నారు.

కానీ సత్యానికి అర్థమే లేదని, అధికారమే అన్నింటి కంటే ముఖ్యమని మోహన్ భాగవత్ అంటున్నారని పేర్కొన్నారు.

ఓటు చోరీ కేవలం ఓటు చోరీనే కాదు రాజ్యాంగ దురాక్రమణ అని రాహుల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కార్యకర్తల డీఎన్ఏలో సత్యం ఉందన్నారు. భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు సత్యం వైపునే నిలబడుతుందని అన్నారు. నరేంద్ర మోదీ ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. అధికారం ఉందని, అందుకే వారు 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని ఆరోపించారు.బిహార్ ఎన్నికల సమయంలో బీజేపీ రూ. 10,000 బదిలీ చేసిందని, అయితే ఎన్నికల సంఘం వారిపై ఎలాంటి చర్య తీసుకోలేదని గాంధీ ఆరోపించారు. సత్యానికి, అసత్యానికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో, ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని ఆరోపణలు చేశారు.

మోదీ ఎన్నికల సంఘానికి రక్షణ కల్పించడానికి ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. తాము ఆ చట్టాన్ని మార్చి ఎన్నికల.. మిగతా5లో...

## రాజ్యాంగ రద్దుకు బీజేపీ కుట్ర

- రామ్‌లీలా మైదానంలో సీఎం రేవంత్ రెడ్డి ఉద్వేగభరిత ప్రసంగం
- ప్రజలంతా అప్రమత్తులు కావాలి
- రాజ్యాంగాన్ని ప్రజలే కాపాడుకోవాలి
- దళితులకు ఓటు హక్కును ఆరెస్ఎస్ వ్యతిరేకించింది
- ఓటు చోరీ సభలో సీఎం రేవంత్



5

## ఆర్టీసీ అమ్మివేతకు కాంగ్రెస్ ప్రయత్నం

- ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తున్నారని కవిత ఆరోపణ
- హైదరాబాద్‌లో 7500 బస్సులను 3500కు తగ్గించారని విమర్శ
- జనంబాట కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి సమస్యల గుర్తింపు
- అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కవిత డిమాండ్




5

## మేము తిరగబడితే మీరు తట్టుకోలేరు

- కాంగ్రెస్‌కు కేటీఆర్ హెచ్చరిక
- కాంగ్రెస్ హత్య చేసిన మల్లయ్య కుటుంబానికి అండగా నిలుస్తాం
- ఐదు లక్షల సాయం
- అధికారంలోకి వచ్చిన తరువాత ఒకరికి ఉద్యోగం
- కేటీఆర్ హామీ

5



# సీఐసీగా గొయేల్

**విశ్వంభర, డెస్క్ :** నూతన ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారి రాజ్‌కుమార్ గోయల్‌ను కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక ప్యానెల్ బుధవారం సమావేశమై గోయల్ పేరును సీఐసీ పదవికి సిఫార్సుచేసినట్లు శనివారం ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. కమిషనర్ల ఎంపిక కోసం గతవారం జరిగిన సమావేశంలో ఎంపిక కమిటీ సభ్యుడు ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కమిషనర్ల జాబితాపై అభ్యంతరం తెలిపారు.

సీఐసీగా గోయల్‌తోపాటు మరో ఎనిమిది మంది ఇన్ఫర్మేషన్ కమిషనర్(ఐసీ)లను కొత్తగా ప్యానెల్ సిఫార్సుచేసింది. గోయల్ చేత సీఐసీగా సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయిస్తారు. అరుణాచల్ ప్రదేశ్-గోవా-మిజోరం-యూనియన్ టెరిటరీస్(ఏజీఎంయూటీ) క్యాడర్‌కు చెందిన 1990 బ్యాచ్ (రిటైర్డ్) ఐఏఎస్ అధికారి అయిన గోయల్ ఇటీవల కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శిగా సేవలందించారు. గతంలో ఈయన.. మిగతా5లో...



## హరీశ్‌రావుతో జాగ్రత్త ఉండండి

- వెన్నుపోటు పొడుస్తారని హెచ్చరిక
- కల్వకుంట్ల కవిత ఎదురుదాడి చేస్తోంది
- కేసీఆర్ కు టీపీసీసీ చీఫ్ మహేశ్ హెచ్చరిక
- నానాటికీ బీఆర్ఎస్ పార్టీ బలహీనపడుతోంది
- తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాలేదు




విశ్వంభర, న్యూ ఢిల్లీ : మాజీ మంత్రి హరీశ్‌రావు విషయంలో కేసీఆర్ జాగ్రత్తగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. హరీశ్‌రావు ఏ క్షణంలోనైనా కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే ప్రమాదం ఉందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కే. సీ. ఆర్ కు హితవు పలికారు. ఢిల్లీలో ఆదివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ.. మిగతా5లో...

## ప్రధాని ఆఫీసుకు ఆపేరేమిటి?

- అదేమైనా తీర్థాస్థలమా !
- అదేమైనా పాపాలను కడిగేస్తుందా?
- ముక్తేశ్వరానంద

5



## రెండో విడత పల్లెపోరు ముగిసింది

- రాష్ట్రవ్యాప్తంగా 192 మండలాల్లోని 3,911సర్పంచ్ లు, 29,917 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్

5



# భక్తులకు పరమ పవిత్రం ధనుర్మాస వ్రతం

## పవిత్ర ధనుర్మాస వ్రతం ప్రారంభం



మాసాలన్నింటిలో మార్గశీర్ష మాసం ఎంతో శుభప్రదమైనది. ఈ మార్గశీర్షంలో ధనుర్మాసం పరమ పవిత్రమైనది. ప్రతి ఏడు డిసెంబర్ 16వ తేదీ నుంచి పవిత్రమైన ధనుర్మాస వ్రతం మహోత్సవం ప్రారంభమై, తర్వాత ఏడాది జనవరి 14 వరకు ఈ వ్రతం కొనసాగుతుంది. మార్గశీర్షం నుండి వచ్చే పుష్య మాసం దాకా హేమంత ఋతువు. ఈ ఋతువు మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. అనేక రకాలైన ఫల పుష్పాదులు లభిస్తాయి. వాతావరణం ఉదయం సాయంకాలం శీతలంగా ఉన్నా, మధ్యాహ్నవేళ చిరు ఎండలతో వెచ్చదనాన్ని కలిగిస్తూ ఉల్లాసంగా, ఉత్సాహభరితంగా ఉంటుంది. భోజనాధులలో కూడా చిరు మార్పులు చోటు చేసుకుంటాయి. భక్తి భావ యుతమైన సుప్రభాత వేళలు ఆహ్లాదకరంగా ఆనందంగా ఉంటాయి.

**"మాసానాం మార్గశీర్షో హం"**
**భగవానువాచ**

శ్రీమద్భగవద్గీతలో "మాసానాం మార్గశీర్షోహం" అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు. ఇందులో మార్గం అంటే భగవంతుని వైపు వెళ్లే మార్గం. శీర్షం అంటే శ్రేష్టమైనదని అర్థం. భగవంతుని సేవలో తరించడమే భక్తులకు ఏకైక మార్గం. దిక్కు. ఆ దిక్కు వైపు పయనించడానికి మనసులు ఉవ్విళ్లూరుతూ ఉంటాయి. భాగవతంలో గోపికలు భక్తి పూర్వకంగా కాత్యాయని వ్రతంచేసినట్లు చెప్పబడింది.
"గోప కుమారికలు రేపకడ లేచి, చని, కాళిందీ జలంబులం దోగి, జలతీరంబున నిసుమునంగాత్యాయనీ రూపంబు చేసి, మాస వ్రతంబు సలిపి" అని పోతన కవి చెబుతూ దీనిని మాస వ్రతంగా పేర్కొన్నాడు.
గోదాదేవి తిరుప్పావై భక్తిరస పాశురాల పారవశ్యం మృగశిరా నక్షత్రంతో కూడిన పౌర్ణమి గల మాసం మార్గశీర్షం. సూర్యుడు ధను రాశిలో ప్రవేశించడమే ధనుర్మాసం. ఈ ధనుర్మాస వ్రత విధానాన్ని మొట్టమొదట ఆచరించి తానే "తిరుప్పావై" పేరిట రోజుకొకటి చొప్పున రాసి, పాడి శ్రీకృష్ణభగవానునికి కీర్తన కైంకర్యముతో తరించిన వాగ్గేయకారిణి గోదాదేవి. తమిళ సాహిత్యానికే తలమానికమైన తిరుప్పావై లోని ప్రతి పాశురం భక్తిరస భావ బంధురమే. నీలాదేవి కూడా కృష్ణపారవశ్యములో తరించిన దేవేరులు. "శూడి కుదుత్తనాచ్చియార్" గా పిలవబడే గోదాదేవి పాండ్య దేశంలోని శ్రీవిల్లి పుత్తూరు గ్రామంలో హరి పద కమల సేవారతుడైన శ్రీ విష్ణు చిత్తులనబడే పెరియాళ్వార్లకు తులసీ వనంలో లభించిన అయోనిజ గోదాదేవి. తండ్రి వలెనే ఈమె కూడా వటపత్రశాయిని సేవించిన పరమ భక్తురాలు. భగవంతుని తత్వాన్ని అణువణువునా పుణికి పుచ్చుకున్న గోదాదేవి తమిళ దేశంలోని 12 మంది ఆళ్వారులలో ఈవిడ ఒక్కతే మహిళా ఆళ్వారు. తండ్రి విష్ణు చిత్తులు పెరియాళ్వార్ వారి భగవంతుని యొక్క పరతత్వాన్ని పాండ్యరాజు కొలువులో పండిత దిగ్దంతు ల మధ్య రుజువు చేసినవాడు. శాస్త్ర ప్రమాణాలతో భగవత్ మహిమను విషదీకరించినవాడు. శాస్త్రవాదాల్లో గెలిచి పాండ్యరాజు చేత గౌరవింపబడినవాడు. స్వతహాగా మాలాకారుడు. ప్రతిరోజు వటపత్రశాయికి తులసీమాలలు కూర్చి అర్పించేవాడు. గోదాదేవి కూడా తండ్రి వెంట కోవెలకు వెళ్లి, తాను కూడా మాలను అల్లి, ముందుగా తాను మాలను ధరించి, అద్దంలో చూసుకోని ఎంతో మురిసిపోయి ఆనందంతో స్వామికి అర్పించేది. అది గమనించిన తండ్రి దోషమని కూతురిని హెచ్చరించాడు. అయినా ఆమె మానలేదు. ప్రతిరోజు ఒక పాశురం రాసి పాడిన నిష్టగల భక్తురాలు గోదాదేవి.

తిరుప్పావు భక్తిరస గ్రంథం 'ఆముక్తమాల్యద' ప్రబంధం

తమిళ దేశంలో ఎంత ప్రసిద్ధమో తెలుగుదేశంలో కూడా తిరుప్పావు సాహిత్యం అంతే ప్రసిద్ధమైంది. అనేక అనువాదాలు, నాటకాలు, నృత్య నాటికలు వచ్చాయి. ఈ కథని 'ఆముక్తమాల్యద' పేర సాహితీ సమరాంగణ సార్వభౌముడుగా కీర్తిగాంచిన శ్రీకృష్ణ దేవరాయలు ఒక ప్రబంధ గ్రంధాన్ని తెలుగువారికి కానుకగా అందించారు. ఈ వ్రతాన్ని తమిళులు తిరుప్పావు గాను, తెలుగువారు శ్రీవ్రతముగాను ఆచరిస్తారు. ఆశ్రయ, ఆశ్రిత ధర్మాల రూపమే భగవంతునికి భక్తునికి గల అనుబంధాన్ని వివరించే పవిత్ర మాసమే ధనుర్మాసం.

పాశురాలలో దాగిన పరమార్థం

దేహాలంకారం కంటే ఆత్మా అలంకారం గొప్పది అంటారు ఆధ్యాత్మికవేత్తలు. భగవద్గుణ వైభవాన్ని తాను అనుభవించి, ఇతరులకు బోధించడంలో పరమార్థం ఉందని ఈ పాశురాల్లో చెప్పబడింది. జీవాత్మ పరమాత్మల దగ్గరి సంబంధాన్ని పువ్వులోని తావి వంటిదని తెలిపింది. ప్రతి పాశురంలోనూ భక్తి భావ సుమధుర ప్రకంపనలే. తమిళ దేశంలోనూ, ఆంధ్ర దేశంలోనూ గల అన్ని శ్రీవైష్ణవ దేవాలయాలలో తెల్లవారు ఝాముననే అర్చనాదుల తర్వాత తిరుప్పావై పాశుర పఠనం, ప్రవచనాలు జరుగుతాయి. ఆ పాశుర వైభవాన్ని వివరిస్తారు పండితులు. శ్రీకృష్ణ పరమాత్ముని పలు విధాల కీర్తించి ప్రజ్ఞానులైన భక్తులకు జ్ఞానం కలిగించి, ముక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తుంది. ఈ దేశంలో అందరూ సుఖంగా ఉండాలని కోరుకుంటుంది. పాడిపంటలతో దేశమంతా కళకళలాడాలని, ప్రతి ఇల్లు ధారలుగా కురిసే ఆవు పాలతో బురదమయంగా మారాలని, నెలకు మూడు వానలు కురవాలని, చెరువులు కుంటలు నిండాలని, వాగులు, వంకలు సమృద్ధిగా పారాలని, ముక్కారు పంటలతో పల్లె సీమలు నిత్యం కళకళలాడాలని పాశురాలలో కోరుకోబడుతుంది.
ఇహపరాల్లో ఆనందాన్ని లోక కల్యాణాన్ని ప్రసాదించే ఈ పవిత్ర మాసంలో సనాతన వైష్ణవ ఆచారాలను భక్తిశ్రద్ధలతో ఆచరిద్దాం! తరిద్దాం!



- చౌదూరి నరసింహారావు
సాహిత్య కళ విభూషణ
నంది పురస్కార గ్రహీత
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
: 9705100788

# ఉక్కుమనిషి 'సర్దార్'

డిసెంబర్ 15.. పటేల్ వర్ధంతి



సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరు వినగానే దేశ స్వాతంత్ర్యం అనంతరం స్వదేశీ సంస్థానాల విలీనం అంశం ఎవరికైనా గురుకొస్తుంది. 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ నిజాం పైకి భారత సైన్యంతో దాడి చేయించి, రజాకార్లను పారద్రోలి, ఆ సంస్థానాన్ని ఇండియన్ యూనియలో విలీనం చేసిన పటేల్ ఘనత అందరికీ స్పురణకు వస్తుంది. నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగించి, మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ను లొంగ దీసుకున్న మహా సాహసి మన 'సర్దార్'. 'ఉక్కుమనిషి'గా దేశ ప్రజ లంతా కీర్తించిన ఆయన 1875 అక్టోబర్ 31న గుజరాత్ లోని నడియాలో పటేల్ జవేరి భాయ్, లాడ్ దంపతులకు నాలుగవ సంతానంగా జన్మించాడు. ఇంట్లో అన్నలు తనపై అధికారం చెలాయించిన క్రమంలో ఆయన తరుచూ ఎదురు తిరిగేవాడు. ఆ మనస్తత్వ ప్రభావమే పెద్దయ్యాక ఆయనలో స్పష్టంగా కనిపించింది. బాల్యంలో ఆకతాయిగా తిరుగుతూ చదువుపై అంతగా ధ్యాస పెట్టని పటేల్ ఏళ్ల వయసులో మాత్రం ఆంగ్లభాషపై మమకారం పెంచుకున్నాడు. నాలు గేళ్లు కష్టించి మెట్రిక్యులేషన్ పూర్తి చేశాక, జిల్లా ప్లీడర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి న్యాయవాద వృత్తిని చేపట్టారు. లండన్ వెళ్లి 'బారిస్టర్' చదవనిదే తనకు గౌరవం దక్కదని భావించి, మూడేళ్ళు శ్రమించి తగిన ధనాన్ని సంపాదించారు. సోదరుడు విఠల్ భాయ్ పటేల్ కోరికపై తాను సంపాదించిన డబ్బుతో అతడిని బారిస్టర్ చదివించారు. అన్న తిరిగి వచ్చాక, మళ్లీ సంపాదించిన డబ్బుతో లండన్ వెళ్లి బారిస్టర్ పూర్తి చేశారు. తాను చదివిన విద్యాసం స్థలో ఉత్తమ విద్యార్థిగా 57 పౌనుల బహుమానాన్ని పొందారు. స్వదేశం వచ్చాక సూటు ,బూటు,హ్యాటు ధరించి అహమ్మదాబాద్ లో గొప్ప క్రిమినల్ లాయర్గా పేరుగాంచారు. ఒకరోజు స్నేహితులతో కలిసి క్లబ్లో పేకాడుతున్న సమయంలో గాంధీజీ అక్కడికి వచ్చి, జాతీయ పాఠశాలను నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. అపుడు గాంధీజీ వైపు పటేల్ కన్నెత్తైనా చూడలేదు. అయితే, అదే ఏడాది గాంధీజీ అధ్యక్షత వహించిన 'గుజరాత్ కాంగ్రెస్ సభకు పటేల్ కార్యదర్శిత్వం వహించాల్సి వచ్చింది. అపుడు మహాత్ముని ప్రభావంతో పటేల్ జీవితం దేశానికి అంకితమైంది. 1918లో కైరా జిల్లాలో కరవు కారణంగా పన్ను మినహాయింపు ఇవ్వాలని రైతులు చేసిన విజ్ఞప్తిని బ్రిటిష్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కైరా సత్యాగ్రహాన్ని పటేల్ విజయవంతంగా పూర్తి చేయగా, తనకు సరైన అనుచరుడు, కార్యదీక్షాపరుడు లభించాడని గాంధీ ప్రశంసించారు. ఆ తర్వాత అహమ్మదాబాద్ మున్సిపల్ చైర్మన్ గా 1928లో బార్డోలీ సత్యాగ్రహ సారథిగా, 1931లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా, 1912లో క్విట్ ఇండియా ఉద్యమంలో పటేల్ చురుకైన పాత్ర నిర్వహించారు. దేశ విభజన సమయంలో, భారత రాజ్యాంగ నిర్మాణంలో సంస్థానాల విలీనంలో పటేల్ నాయకత్వ పటిమ ఉపయోగపడింది.
గాంధీజీ సహచరుడిగా, జైలులో ఆయనకు సంరక్షకునిగా వ్యవహరించిన పటేల్ వాస్తవ దృక్పథంతో ఆలో చిస్తూ, అరుదైన వ్యక్తిత్వంతో దేశానికి సేవలందించారు. ఒకసారి కోర్టులో వాదిస్తున్న సమయంలో ఆయనకు టెలిగ్రాం రాగా, దానిని చదువుకుని కొద్దిసేపు కళ్లు మూసుకొని, ఏమీ కానట్లు తన వాదనను కొనసాగిం చారు. ఆ తర్వాత అందరికీ తెలిసింది ఆయన భార్య మరణించినట్లు టెలిగ్రాంలో వర్తమానం ఉందని. దేశ విభజన వేళ 'కుళ్లిన అవ యవాన్ని ఖండించి, మిగిలిన శరీరాన్ని కాపాడడమే మన కర్తవ్యం. దేశ విభజనకు ఒప్పుకోకుంటే స్వాతంత్ర్యం వచ్చే అవకాశమే ఉండదు. మొత్తాన్ని కోల్పోవడం కంటే కొంత వదులుకోవడానికే నేను ఇష్టపడతాను' అని ఆయన చెప్పేవారు.
బార్డోలి సత్యాగ్రహం సందర్భంగా 'తక్కువ మాట్లాడండి, ఎక్కువ సాధించండి, విప్లవం.. అని కేకలు వేయకండి, అలా కేకలు వేసే నాయకులకు కొదవ లేదు. క్రమశిక్షణాశీలురైన అనుచరులు లేనిదే పోరాటం విజయవంతం కాదు. మంచి సైనికులుగా తయారుకండి' అని పటేల్ పిలుపునిచ్చారు కాగా, జాతీయోద్యమ సమయాన పటేల్ నెహ్రూతో విభేదించారు. 1938 నాటి కాంగ్రెస్ సదస్సులో నెహ్రూ ప్రవచించిన సోషలిజాన్ని పటేల్ వ్యతిరేకించారు. సంస్థానాల విలీనంలో నెహ్రూ శాంతి కాముకతను కాదని, సైనిక చర్యలు చేపట్టి సర్దార్ విజయం సాధించారు. పాకిస్తాన్ కు 55 కోట్ల రూపాయలు ఇవ్వరాదని నెహ్రూతో వాదించారు. తొలి రాష్ట్రపతి ఎన్నికలలో నెహ్రూ రాజగోపాలాచారిని సమర్థించగా, పటేల్ రాజేంద్ర ప్రసాద్ ను ప్రతిపాదించి సఫలీకృతులైనారు. భారత రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షునిగా అంబేద్కర్‌ను నియమించడంలో పటేల్ కీలక పాత్ర పోషించారు. 1950లో కాంగ్రెస్ అధ్యక్షునిగా నెహ్రూ కృపలానీని సమర్థించగా, పటేల్ పురుషోత్తమ్ దాస్ టాండన్ ను గెలిపించారు. కేంద్ర హోం మంత్రిగా, ఉప ప్రధానిగా 1947 నుండి 1950 డిసెంబర్ 15న మరణించే వరకు పదవిలో ఉన్నారు. పటేల్ సేవలకు గుర్తింపుగా 1991లో 'భారతరత్న' పురస్కారం ప్రకటించింది.

# అమరజీవి ఆత్మార్పణానికి మరో కోణం

(నేడు ఆయన వర్ధంతి)

అమరజీవి'గా ప్రాచుర్యం పొందిన పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష చేసి, ఆత్మార్పణం చేసుకున్న నేపథ్యం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆయన ఆమరణ నిరాహారదీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసమే అనే మిగుల ప్రచారంలో ఉన్నా, దాని వెనక మద్రాసు నగర అంశం ప్రధానమని కొందరి అభిప్రాయము. రాష్ట్ర ఏర్పాటు అనేది చాలా తీవ్రమైన రాజకీయ సమస్యగా మారిపోగా, అలాంటి రాజకీయ సమస్య కోసం శ్రీరాములు దీక్ష చేయటానికి ప్రధానంగా మద్రాసు నగర భవిష్యత్తే అని పలు వ్యాసాలను బట్టి మరో కోణానికి బలం చేకూరు తున్నది.
మహాత్మా గాంధీ వ్యక్తిత్వానికి ప్రభావితులై, ఉద్యోగం వదిలి దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆయనతో శ్రీరాములు సన్నిహితంగా మెదిలారు. జాతిపిత అహింస సిద్ధాంతాన్ని విశ్వసించి, పలుమార్లు ఆచరించి.. విజయం సాధించారు. అదే మార్గంలో దీక్ష చేయాలని నిర్ణయించారు.
అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సందర్భంగా.. తనకు ఎదురవుతున్న సవాళ్లను తెలియజేస్తూ శ్రీరాములు రాసిన లేఖకు సమాధానంగా గాంధీజీ స్వదస్తూరితో ఇచ్చిన జవాబు... 'అన్ని విధాలుగా ప్రచారాన్ని కొనసాగించు. కానీ ఇప్పుడే దీక్ష వద్దు' అని గాంధీ బదులిచ్చారు.
వివిధ రాష్ట్రాల్లో సత్యాగ్రహ ఉద్యమాలు చేస్తూ జైలుకెళ్లిన శ్రీరాములు బీహారు వంటి రాష్ట్రాల్లో కూడా సేవలు చేశారు. అనంతరం నెల్లూరులో దళితులకు ఆలయ ప్రవేశం, అస్పృశ్యత నివారణ మొదలైన సాంఘిక అంశాలపై ప్రచారం, నిరాహార దీక్షలు చేసి విజయం సాధించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు ముందు శ్రీరాములు ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు.
''మద్రాసును కేంద్ర పాలిత ప్రాంతం చేయాలి'' అని 1952 సెప్టెంబర్ 15వ తేదీన శ్రీరాములు నెల్లూరు నుంచి భాగవతుల లక్ష్మీ నారాయణకు ఒక లేఖ రాశారు. అందులో.. ''ఆంధ్ర రాష్ట్ర సమస్య అనేక మందికి, అనేక పార్టీలకు, అనేక అభిప్రాయాలకు, అనేక భావాలకు అనేక రకాలుగా పుట్టిల్లు అయ్యింది. ప్రతి ఒక్కరి స్వార్థమూ వేర్వేరుగా ఉంది. ప్రత్యక్ష ఆర్థిక లాభాలున్నాయి. కాబట్టి అందరూ పరమార్థ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఏకాభిప్రాయానికి రాలేరు. అధికారంలో ఉన్న మహా నాయకుల దృష్టి మార్చాలంటే సామాన్యం కాదు. ఇందుకు ఒక్కటే మార్గం కనబడుతోంది. నిష్కామ దృష్టితో, ద్వేష రహితంగా, నిశ్చింతగా ప్రాణాలర్పించటమే. ఇక ఈ సమస్యను ఉపేక్షించటం పాపమని నిన్నే (1952 సెప్టెంబర్ 14) అనిపించింది''.





తర్వాత 15 రోజులకు భీమవరంలో స్వామి సీతారాంను శ్రీరాములు కలిసి, లక్ష్మీనారాయణకు రాసిన లేఖను, దానితోపాటు పంపించిన 'ఆంధ్ర రాష్ట్రం' అనే వ్యాసాన్ని చూపించారు. వాటిని పరిశీలించిన స్వామి సీతారాం అక్టోబర్ 2వ తేదీన శ్రీరాములుకు తన స్పందన తెలియజేస్తూ లేఖ రాశారు. దీక్ష చేయాలన్న శ్రీరాములు నిర్ణయాన్ని అభినందిస్తూనే.. ''ప్రస్తుతానికి మద్రాసు నగర భవిష్యత్తును గూర్చి పట్టుబట్టడం ఉచితం కాదు'' అని సూచించారు. కానీ, ఆయన సూచనను శ్రీరాములు అంగీకరించలేదు. ''మద్రాసు నగర భవిష్యత్తు నిర్ణయించే బాధ్యత తను పండిట్ నెహ్రూకు అప్పగించటానికి వీలులేదు. మద్రాసు నగర పౌరులే ఆ నగరం భవిష్యత్తుని నిర్ణయించాలి. నా దీక్ష వలన మద్రాసు నగరంలోని తమిళ ప్రముఖుల్లో కొందరిలోనైనా హృదయ పరివర్తన ఏర్పడి.. మద్రాసు నగరాన్ని కేంద్ర పాలిత రాష్ట్రంగా ఏర్పరచడానికి వారు అంగీకరించగలరని నేను నమ్ముతున్నాను. ప్రజాభీష్టాన్ని అమలు జరపడమే పండిట్ నెహ్రూ వంతు'' అని పేర్కొన్నారు.
1952 అక్టోబరు 19వ తేదీన తన దీక్ష ప్రారంభించడానికి ముందు పత్రికలకు శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో.. ''మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం సాధించడానికి తీవ్రమైన కృషి జరగాలి'' అని పేర్కొన్నారు.
దీక్షకు ఐదు రోజుల ముందు మద్రాసు పౌరులకు చేసిన విజ్ఞప్తిలో ఆయన ఇలా పేర్కొన్నారు..
''ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని తగినంత ప్రచారం, ఆందోళన, లెక్కల సేకరణ మొదలైనవి ఇప్పటికే జరిగాయి. 1916లోనే ఆంధ్రోద్యమ ప్రచారం ముమ్మరం కావటంతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన సమస్య అందరి దృష్టినీ ఆకర్షించింది. దానివలన కలిగిన తక్షణ ఫలితం అనిబిసెంటు అధ్యక్షతన 1917 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయడం. 'ఆ రాష్ట్ర కాంగ్రెసు సంఘం మదరాసు నగరం మీద తక్కిన మదరాసు రాష్ట్ర కాంగ్రెసు సంఘంతో సమానంగా హక్కు కలిగి ఉంటుంది' అని ఒక తీర్మానం కూడా ఆ సందర్భంగా ఆమోదించబడింది.''
ఆయనదీక్షను చేపట్టాక...విరమించడానికి రెండు షరతులు పేర్కొన్నారు.
1) మద్రాసు నగర భవిష్యత్తు విషయమై మద్రాసు పౌరుల్లో ఏకాభిప్రాయం ఏర్పడటం.
2) భారత ప్రభుత్వం రాజ్యాంగం లోని 3వ ఆర్టికల్ కింద ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం.
''పొట్టి శ్రీరాములు దీక్ష వెనుక లక్ష్యం గురించి ఆయన మేనల్లుడు ఎన్ఆర్ గుప్తా మాటల్లో.. ''మద్రాసు ఉమ్మడి సొత్తుగా ఉండాలని ఆయన అనుకుంటూ వచ్చారు. మద్రాసు మన సొత్తు కావచ్చు. అయితే, వాళ్లు (తమిళులు) మనం చాలా కాలంగా కలసి ఉంటున్నాము. అలాంటప్పుడు మనల్ని వాళ్లు వెళ్లిపొమ్మంటే ఎంత కష్టపడతామో.. వాళ్లను మనం వెళ్లిపొమ్మన్నా అంత కష్టపడతారు. అందువల్ల ఉమ్మడిగా నగరం చేస్తే బాగుంటుందన్నారు.''
''మరి నిర్వివాద ప్రాంతాలతో చాలామంది రాష్ట్రం కావాలంటున్నారు కదా! అంటే.. 'మనం మద్రాసు ఎందుకు వదులు కోవాలి? వేరేచోటకు వెళ్లి మట్టిలోను, ఇటుకల్లోను రూ. 1520 కోట్లు ఎందుకు పోసుకోవాలి? ఇంత డబ్బు ఎందుకు వృధా చెయ్యాలి? త్వరగా రాష్ట్రం వస్తుందని ఉన్న హక్కును ఎవరైనా వదులు కుంటారా? అసలు ఆ మాటకు వస్తే మద్రాసుపై మనకు ఎక్కువ హక్కు ఉంది. ఇదంతా గుర్తించే ధార్ కమిటీ మద్రాసును ప్రత్యేక రాష్ట్రం చెయ్యాలని న్యాయంగా తీర్పు చెప్పింది. మన రాజధాని ఈ నగరంలో వద్దు అని అంతా అంటే నేను ఏమంటా? ఆంధ్ర రాష్ట్రపు రాజధాని వేరేచోట పెట్టుకోవచ్చు. అయితే, ఈ వ్యవహారాన్ని సామరస్యంతో పరిష్కరించుకోవాలి.''
అయితే, మద్రాసు కోసం ఎందుకు ఉపవాసం చేయటం, విడిచి పెట్టవచ్చు కదా? అని తాను అడిగానని, అందుకు శ్రీరాములు స్పందిస్తూ.. ''నేను చచ్చిపోవాలని చెయ్యడం లేదు. మనకు న్యాయమైన హక్కు ఉన్నదనటం కోసం చేస్తున్నాను. అదివస్తే సంతోషిస్తాను. రాకపోతే చచ్చిపోతాను. నేను పోతే దీన్ని సాధించటానికి ఎవరికైనా అవకాశం ఉండవచ్చు'' అన్నారని గుప్తా తెలిపారు. (ఆంధ్ర పత్రిక: 18 డిసెంబర్ 1952)
ప్రకాశం పంతులు మాటల్లో చెప్పాలంటే.. ''ఉపవాసం చెయ్యడానికి ఎవ్వరూ స్థలం ఇవ్వకపోతే అట్టలు కట్టుకొని, వీధుల్లో తిరిగి ప్రాణాలైనా అర్పిస్తానన్న పట్టుదల గల మనిషి శ్రీరాములు''. ఆయనకు ఆశ్రయం ఇచ్చేందుకు బులుసు సాంబమూర్తి ముందుకు వచ్చారు. పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19వ తేదీన బులుసు సాంబమూర్తి ఇంట్లో ఆమరణ దీక్ష ప్రారంభించారు. 1952 అక్టోబర్ 19వ తేదీ నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. 57వ రోజు ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు. తన ఆశయసాధనలో ప్రాణాలర్పించి అమరజీవి అయ్యాడు. డిసెంబర్ 16వ తేదీన రెండెడ్ల బండి మీద కట్టిన రథంపై శ్రీరాములు అంతిమ యాత్ర జరిగింది. మద్రాసు లేకుండా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబర్ 19వ తేదీన లోక్‌సభలో ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు. ఈ మేరకు వాంఛూ కమిటీని ఏర్పాటు చేశారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 2008 మే 22వ తేదీన నెల్లూరు జిల్లా పేరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

## ""అంతా మా ఇష్టం, మా ఇష్టం మాత్రమే..

...టోటాలిటేరియనిజం జిందాబాద్
ఇక్కడ మేము మెజారిటీ.
మీరు మైనారిటీ.
మేము మాత్రమే మాట్లాడతాము.
మేము మాత్రమే రాస్తాము.
మేము మాత్రమే చెబుతాము.
మీరు అన్నీ మూసుకొని వినాలి.
మీరు ఇక్కడే ఉన్నారు,ఉంటున్నారు కదా.
అందువల్ల మీ మీద దయతలచి
ఒక వెసులుబాటును ఇస్తున్నాం.
మాట్లాడండి.కానీ...
అది మా మాటే అయి ఉండాలి.
అది మాకు నచ్చాలి.
నచ్చి తీరాలి.
మేము మెచ్చాలి.
మాటే కాదు....
ఆట,
పాట,
బాట
రాగం,
తాళం,
నడక
నడత,
ఆహారం,
ఆహార్యం సహా అన్నీ మాకు నచ్చినట్లు మాత్రమే ఉండాలి.
ఉండి తీరాలి అంతే.
మరో మాటకు తావు లేదిక్కడ.
దీనికి రూల్స్, గీల్స్,శాసనాలు, గీశనాలు,రాజ్యాంగాలు లాంటివి ఏమీ ఉండవు.
ఉన్నా అవి మాకు వర్తించవు.
అలాంటివి మాకు అక్కర్లేదు కూడా.
మాకు అలాంటి వాటితో పని లేదు.
ఇక్కడ మా మాటే శిలా శాసనం.
మేము మెజారిటీ కాబట్టి,
మా రాజ్యం కాబట్టి,
రాజు మా వాడే కాబట్టి.....
అన్నీ మా ఇష్టం.
అంతా మా ఇష్టం మాత్రమే.""



- గంటె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

# "ఓటు చోరీ" కి మోడీ, షాల ఉమ్మడి కుట్ర



(3వపేజీ తరువాయి)

కమిషనర్లపై చర్య తీసుకుంటామని తెలిపారు.

దేశాన్ని కాంగ్రెసే కాపాడుతుంది : ఖర్గే

ఓటు హక్కును, రాజ్యాంగాన్ని కాపాడటానికి 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్న బీజేపీని అధికారం నుంచి తొలగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు. ఓట్ చోర్‌గద్దీ ఛోడ్ ర్యాలీలో పాల్గొన్న ఆయన, దేశాన్ని కాపాడగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని తెలిపారు. అందుకే కాంగ్రెస్ సిద్ధాంతాన్ని ఐక్యంగా బలోపేతం చేయడం ప్రతి భారతీయుడి కర్తవ్యం అని అన్నారు.

"రాహుల్‌గాంధీ ఈ దేశం కోసం చేస్తున్న పోరాటాన్ని బలపర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

ఆయనకు మద్దతు ఇవ్వకుంటే మీకు నష్టం, దేశానికి నష్టం. ఈ దేశాన్ని కాపాడాలంటే, రాజ్యాంగాన్ని రక్షించాలంటే మీకోసం మీరు పనిచేయాలి. మన సమస్యలపై రాహుల్, సోనియా, ప్రియాంక లు బలమైన పోరాటం చేస్తున్నారన్నారు. మనమంతా ఏకమై వారి పోరాటాన్ని బలపర్చాలి. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల అని

మల్లికార్జున ఖర్గే విజ్ఞప్తి చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం దేశాన్ని నాశనం చేయడమేనని ఆరోపించారు. బీజేపీ వాళ్లు ద్రోహులు, నాటకాలు ఆడేవారని విమర్శించారు. అందుకే వారిని అధికారం నుంచి తొలగించాలని పిలుపినిచ్చారు. 140 కోట్ల మంది ప్రజలను కాపాడటం ముఖ్యమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. అందుకే తన కొడుకు బెంగళూరులో ఆపరేషన్ చేయించుకుంటున్నా తాను వెళ్లకుండా ఈ ర్యాలీకి హాజరయ్యానని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు.

# ఆర్టీసీ అమ్మివేతకు కాంగ్రెస్ ప్రయత్నం

**విశ్వంభర, హైదరాబాద్:** ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆదివారం నాడామె బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ ది మీట్‌లో మాట్లాడారు.

హైదరాబాద్ మహానగరంలో కోటి మంది పైచిలుకు ప్రజలు నివాసం ఉంటున్నారు. నగరంలో 7500 వరకు ఉండే ఆర్టీసీ బస్సులను.. ఉచిత బస్సు ప్రయాణం వచ్చాక 3500కు తగ్గించారు. దీంతో ప్రయాణించాలంటే ప్రజలకు చాలా ఇబ్బందిగా మారింది. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీను ప్రైవేటు పరం చేసే ప్రయత్నం సర్కారు చేస్తున్నది. రవాణా వ్యవస్థనే సరిగా సక్రమంగా లేనప్పుడు హైదరాబాద్ విశ్వనగరం ఎలా అవుతుందని ఆమె ప్రశ్నించారు.

అక్టోబర్ 25 నుంచి జాగృతి జనంబాట కార్యక్రమం కొనసాగుతుందని ప్రకటించారు.

ప్రతి జిల్లాలో రెండ్రోజులు మకాం వేసిఅక్కడి సమస్యలను తెలుసు కుంటామని ఆమె తెలిపారు.

15 రోజుల పాటు పంచాయతీ ఎన్నికలు ఉన్నాయి కాబట్టి ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పర్యటించానని తెలిపారు.

హైదరాబాద్‌లో వీధికుక్కలు కరవటం పెద్ద సమస్యగా మారిపోయిందని ఆమె వాపోయారు.

సిటిజన్ పోలీసింగ్ ఉంటే బాగుంటుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల కొరత చాలా ఎక్కువగా ఉందన్నారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి నగరం దుర్గంధ మయమై పోయిందని ఆమె అన్నారు. సీతాఫల్ మండి గవర్నమెంట్ స్కూల్ దగ్గర అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. త్వరలోనే స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. అంబర్ పేట ముసరాంబాగ్ బ్రిడ్జ్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలి. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించాలి. అర్బన్‌లో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. జనం బాటలో అనేక విషయాలు తెలిశాయి'' అని కవిత తెలిపారు.

# భాజపా అధ్యక్షుడిగా నితిన్ నబీన్

**విశ్వంభర, న్యూ ఢిల్లీ:** దేశ అధికార పార్టీ బీజేపీకి ఎట్టకేలకు కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగింది. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ ఆదివారం ప్రకటించింది.

జేపీ నడ్డా స్థానంలో ఆయన పార్టీ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించనున్నారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు.

బిహార్ లోని బాంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నితిన్ నబీన్ వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడాయన బిహార్ రహదారుల నిర్మాణశాఖ మంత్రిగా పని చేస్తున్నారు. భాజపా ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2020 జనవరిలో ఈ పదవిలో నియమితులయ్యారు. ఆయన పదవీకాలం ఎప్పుడో ముగిసింది. పార్టీ అంతర్గత కారణాలు, ఇతర కొన్ని కారణాల వల్ల అధ్యక్షుడిగా ఇంతకాలం నడ్డానే కొనసాగారు.

పార్టీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో బీజేపీ మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ కు బీజేపీకి మధ్య ఈ విషయంలో ఏకాభిప్రాయం కుదరని కారణంగానే ఎంపిక ఇంత కాలం వాయిదా పడుతూ వస్తున్నదనే ఒక ప్రచారం విస్తృతంగానే జరిగింది. మధ్యలో ఒకరిద్దరు అభ్యర్థుల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ ఆర్ ఎస్ ఎస్ అంగీకరించ లేదని వార్తలు వచ్చాయి. ఎట్టకేలకు రెండింటి మధ్య ఏకాభిప్రాయం కుదిరిన ఫలితంగా నితిన్ ఎంపిక జరిగి పోయింది. నితిన్ ఎంపిక పట్ల ప్రధాని మోడీ ఆనందం వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తగా నితిన్ నబీన్ మంచి గుర్తింపును పొందారని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సంస్థాగత నిర్మాణ నిర్వాహణ బాధ్యతల్లో నితిన్ కు మంచి అనుభవం ఉందని మోడీ పేర్కొన్నారు. బిహార్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా అద్భుతమైన రికార్డు ఆయన సొంతం అని చెప్పారు.

రాబోయే కాలంలో నితిన్ భాజపాను మరింత బలోపేతం చేస్తారని తాను విశ్వసిస్తున్నన్నట్లు ప్రధాని ఒక ట్వీట్ ద్వారా తెలిపారు.



# రాజ్యాంగ రద్దుకు బీజేపీ కుట్ర

**విశ్వంభర, ఢిల్లీ:** రాజ్యాంగాన్ని రద్దు చేయాలని భాజపా కుట్ర పన్నిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుము ల రేవంత్ రెడ్డి ఆరోపించారు.

ప్రజలు అందరూ అప్రమత్తులై రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని ఆయన కోరారు. రాజ్యాంగాన్ని రక్షించు కోవడం అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన చెప్పారు 'ఓట్ చోర్‌గద్దీ ఛోడ్' పేరిట దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రామానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు జాతీయ ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ నుంచి ధర్నాలో రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..''మహాత్మా గాంధీ, అంబేద్కర్ రాజ్యాంగ రచన సమయంలో... రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు విషయమై చర్చిస్తున్నప్పుడు ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్ గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు ఇవ్వొద్దన్నారు. కానీ గాంధీ, అంబేద్కర్ వారికి ఓటు



హక్కు కల్పించినందున ఈ దేశంలో ప్రభుత్వం ఏర్పాటులో వాళ్లు కూడా భాగస్వాములయ్యారని తెలిపారు ఆర్‌ఎస్‌ఎస్, గోల్వాల్కర్ భావజాలంతో ఉన్న నరేంద్ర మోదీ, అమిత్ షా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత అదే భావజాలాన్ని అమలు చేసేందుకు 400 పార్లమెంటు సీట్లు కోరుకున్నారు. భాజపాకు 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ చెప్పడంతోనే దేశ ప్రజలు ఆ పార్టీని 240 సీట్లకే పరిమితం చేశారని తెలిపారు.

అలా చేయబట్టే ఇవాళ రాజ్యాంగం.. రిజర్వేషన్లు కొనసాగుతున్నాయ అన్నాన్నాయి.

అందుకే ఇప్పుడు ఎస్ఐఆర్ అనే ముసుగులో రాజ్యాంగ విధ్వాంస ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాడు పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల కోసం గాంధీ, అంబేద్కర్ నిలబడినట్లే.. ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారన్నారు.

మనం వారికి అండగా నిలవాలి. ఎస్ఐఆర్ పేరుతో తొలుత ఓటరు కార్డులను తొలగిస్తారన్నారు.

తర్వాత ఆధార్, రేషన్ కార్డ్ లను రద్దు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ తర్వాత ప్రజలకున్న ఒక్కొక్క హక్కునూ లాగేసుకుంటారని హెచ్చరించారు. ఈ సమస్య ఎన్నికలదో.. కాంగ్రెస్ పార్టీదో కాదు దేశ సమస్య అని గుర్తించాలన్నారు. దీనికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు. దేశ ప్రజలంతా కలిసి రావాలని కోరుతున్నానని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఆస్ట్రేలియాలో ఉగ్ర దాడి

**విశ్వంభర, డెస్క్ :** ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఇద్దరు సాయుధ దుండగులు బీభత్సం పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు.

బాండీ బీచ్‌లో పర్యాటకులు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో బీచ్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో వందల మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. ఈ బీభత్స కాండలో 11 మంది దుర్మరణం పాలయ్యారు. 29 మంది పర్యాటకులు గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కాల్పులు కలకలం రేపాయి. కాల్పులు మొదలైన వెంటనే అక్కడున్నవారు నేలపై పడిపోవడం, దాక్కోవడం, కొందరు సముద్రం వైపు పరుగులు తీయడం వంటి దృశ్యాలు చోటుచేసుకున్నాయి.

నల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు దుండగులు!

గాయపడినవారిలో పర్యాటకులతో పాటు స్థానికులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో చిన్నారి సహా ఓ పోలీసు అధికారి కూడా ఉన్నట్లు ఆస్ట్రేలియా మీడియా అక్కడి పేర్కొంది. గాయపడిన 29 మందిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఇద్దరు పోలీసు అధికారులు ఉన్నారని వారి పరిస్థితి విషమంగా ఉందని న్యూ సౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ తెలిపారు. నల్లటి దుస్తులు ధరించిన ఇద్దరు దుండగులు సర్ఫ్ క్లబ్ పక్కనే ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకొని కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

కాల్పులు జరుపుతున్న దుండగుడిని ఓ పర్యాటకుడు అడ్డగించి అతడి చేతులో ఉన్న తుపాకీ లాక్కొని కాల్చేందుకు ప్రయత్నించాడు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కాల్పుల సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా



స్థలికి చేరుకున్నారు. దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు కాల్పులు జరిపారు. ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు కాల్పులు జరపగా ఒక దుండగుడు హతమయ్యాడు. మరొకడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**ఇది ఉగ్రదాడి!**

మృతిచెందిన దుండగుడికి చెందిన కారులో ఐ.ఈ.డీ ని గుర్తించిన పోలీసులు వెంటనే బాంబ్ డిస్పోజల్ యూనిట్‌కు సమాచారమిచ్చారు. ఇది ఉగ్రదాడి అని న్యూ సౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ తెలిపారు. మృతిచెందిన దుండగడి కారులో ఐ.ఈ. డీను గుర్తించామని చెప్పారు. కౌంటర్ టెర్రరిజంకు చెందిన బృందం దర్యాప్తు చేపడుతుందని వెల్లడించారు. సిడ్నీలోని యూదులను లక్ష్యంగా చేసుకొని దుండగులు కాల్పులకు పాల్పడినట్లు అనుమానిస్తున్నామని న్యూ సౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ తెలిపారు. కాల్పులు జరిగిన సమయంలో బాండీ బీచ్‌లో దాదాపు వెయ్యి మంది ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

భద్రతను మరింత కట్టుదిట్టం చేసిన ప్రభుత్వం బాండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఆయన, హింస, ద్వేషానికి ఆస్ట్రేలియాలో చోటులేదని అన్నారు. పోలీసులు, అత్యవసర ప్రతిస్పందన దళాలు సహాయక చర్యలు చేపడతున్నాయని చెప్పారు. ప్రజలు పోలీసుల సూచనలను పాటించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరొందిన బాండి బీచ్‌లో ఈ తరహా ఘటన జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. పర్యాటకులు భయాందోళనకు గురవుతుండగా, ఆస్ట్రేలియా ప్రభుత్వం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది.

## తీవ్రంగా ఖండించిన మోదీ

మరోవైపు ఆస్ట్రేలియాలోని బీచ్‌లో దుండగులు కాల్పులకు దిగి 11 మందిని పొట్టనపెట్టుకున్న ఘటనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. కాల్పుల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాని సంతాపం ప్రకటించారు. యూదుల పండగరోజు కాల్పులు జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై భారత్ దశాబ్దాలుగా పోరాడుతోందని, ఉగ్ర దాడులు ఎక్కడ జరిగినా భారత్ ఖండిస్తుందని అన్నారు.

# హరీశ్‌రావుతో జాగ్రత్త ఉండండి

(3వపేజీ తరువాయి)

అభివృద్ధి చెందితే ఏ రాష్ట్రం కూడా మన రాష్ట్రంతో పోటీ పడలేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పెద్ద విజన్ ఉందని ఆయన అన్నారు. తమ పార్టీ పాలన పట్ల తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చినన్నీ సంక్షేమ పథకాలు ఎక్కడా లేవని స్పష్టం చేశారు. హైదరాబాద్ అన్నివిధాలా బాగుందని కొనియాడారు. సీఎం విజన్‌తో భూమ్ పెరుగుతోందన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ మీద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎదురుదాడి చేస్తోందన్నారు. జైలుకు వెళ్లిన కవిత సీఎం కావాలని ఆశ పడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆశ ఉండాలి కానీ, కవితది అత్యాశ అని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ ఉంటే కవిత బయటకు ఎందుకు వస్తారని ఆయన ప్రశ్నించారు. నానాటికీ బీఆర్‌ఎస్ పార్టీ బలహీనపడుతోందని జోస్యం చెప్పారు. క్షేత్రస్థాయిలో కేడర్ లేదన్నారు. ఓడిపోతామని తెలిసే జూబ్లీహిల్స్‌లో కేసీఆర్ ప్రచారానికి రాలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీ ఎప్పటికీ అధికారంలోకి రాలేదని, వారు అధికారం కోసం పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఎస్ఐఆర్ తో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పది కిలోల దొడ్డు బియ్యం తప్ప బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమం లేదని ఆయన విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, పార్టీ వ్యవహారాలపైనా మహేశ్ గౌడ్ స్పందించారు. కేబినెట్ ప్రక్షాళనపై కసరత్తు జరుగుతోందని, తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవిపై ఆసక్తి లేదని, టీపీసీసీ అధ్యక్షుడిగానే ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రాబోయే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ సునాయాసంగా గెలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# రెండో విడత పల్లెపోరు ముగిసింది

**విశ్వంభర, హైదరాబాద్:** పంచాయితీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటకు ముగిసింది. ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 192 మండలాల్లోని 3,911సర్పంచ్ లు, 29,917 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పోలింగ్ ముగిశాక గంట భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం మొదలైంది. వార్డు సభ్యులు, సర్పంచ్ అభ్యర్థుల ఫలితాలు ప్రకటించిన అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు.

రెండో విడత పోలింగ్‌లో పలు చోట్ల స్వల్ప ఘర్షణలు, ఉద్రిక్తతలు మినహా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగానే ముగిసింది. స్వల్ప ఉద్రిక్తతలు తలెత్తిన కొన్ని చోట్ల పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు.

# ప్రధాని ఆఫీసుకు ఆపేరేమిటి?



**విశ్వంభర, డెస్క్ :** అభ్యంతరం, ఆగ్రహం 'ప్రధాన కార్యదర్శిని ప్రధానమంత్రి అని పిలిస్తే సరేనా? ఆమోదనీయమేనా? పీ.ఎమ్ ఓ పేరు మార్పుపై శంకరాచార్య మండి పడ్డారు. ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవాతీర్థ్'గా మార్చడంపై జ్యోతిష్య పీఠానికి చెందిన శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సేవాతీర్థ్ అనేది ఒక మతపరమైన పదమని, దానిని ప్రధాని కార్యాలయానికి ఎలా పెట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు. దీనిని సహించబోమని, అవసరమైతే కోర్టుకు కూడా వెళతామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో గో రక్షకులు పోటీ చేస్తారని ప్రకటించారు. బాబర్ పేరుతో ఉన్న టాయిలెట్ కూడా ఈ దేశంలో ఆమోదయోగ్యం కాదని అన్నారు.

ప్రధాన కార్యదర్శిని ప్రధానమంత్రి అని పిలిస్తే, ప్రధానికి నచ్చుతుందా?..

శాస్త్రాల ప్రకారం నీటిలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోయే ప్రదేశాన్ని తీర్థయాత్ర స్థలంగా పిలుస్తారు. ఇప్పుడు చెప్పండి? ప్రధానమంత్రి కార్యాలయంలో పాపాలను కడిగేసే ఎలాంటి నీరు ఉంది? 'సేవా తీర్థం' అనేది ఒక పవిత్రమైన పదం. హిందువులు, ముస్లింలు ఇద్దరూ ఆ కార్యాలయానికి వెళ్తారు. ప్రజలు బూట్లు వేసుకుని అక్కడికి వెళ్తారు. వారిలో చాలామంది మాంసాహారులు ఉంటారు, వారు తమ టిఫిన్ బాక్సులలో మాంసాహార పదార్థాలను కూడా తీసుకువెళ్తారు. వారు తీర్థం అనే పదాన్ని అపహాస్యం చేస్తున్నారు."

శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి అన్నారు.

దేశానికి అధికార భాషా విభాగం ఉందని, వారిని అడిగి తగిన పదాన్ని కనుగొనమని శంకరాచార్య సూచించారు. 'సేవా తీర్థం' అనేది మన మతపరమైన పదమని, దానిని మార్చే హక్కును దేశంలోని ఏ నాయకుడికీ ఇవ్వలేమని చెప్పారు. దౌత్యం, బలవంతం, మోసాలు జరిగే, వివిధ కుట్రలు పన్నే, రకరకాల పథకాలు రూపొందించే, అధర్మం ఉండే ప్రధానమంత్రి కార్యాలయంలో పవిత్రమైన పదాన్ని ఉపయోగించలేరని అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై తాను ప్రధానమంత్రికి లేఖ రాశానని ఆయన తెలిపారు. దీనిని సహించబోమని, అవసరమైతే కోర్టుకు, ప్రజల వద్దకు కూడా వెళ్తామని, మౌనంగా ఉంటే పరిస్థితి మరింత తీవ్రమవుతుందని అన్నారు.

ఇకపై గోభక్తుడు పోటీ చేస్తాడు

మరోవైపు గోవుకు జాతిమాత హోదాను ఇచ్చేందుకు ప్రయత్నాలు లోపించాయని అవిముక్తేశ్వరానంద అన్నారు. ఇప్పటి వరకు దేశంలో విద్యుత్, నీరు, రోడ్లు, ఉపాధి, కులం, మతం వంటి వివిధ సమస్యలపై ఓట్లు వేశారని గుర్తు చేశారు. కానీ దేశంలోని సనాతన ధర్మాన్ని పాటించే ప్రజలు ఇటువంటి విషయాలపై ఇంకా ఓటు వేయలేదని ఆయన అన్నారు. అందుకే, లోక్‌సభ ఎన్నికల నాటికి గోరక్షణ అంశం అతిపెద్ద సమస్యగా మారాలని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఓట్లు వేయాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. ఇకపై మున్సిపల్ ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికలోనూ ఒక గోభక్తుడు పోటీ చేస్తాడని అన్నారు. బిహార్ ఎన్నికల్లో పోటీ చేయడానికి గో రక్షకులను కోరుతూ, ఇక్కడ గో రక్షకులకు 586,013 ఓట్లు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్లను లెక్కిస్తే, అసెంబ్లీ నియోజకవర్గానికి సగటున 3,000 ఓట్లు వచ్చాయని అన్నారు.

# మేము తిరగబడితే మీరు తట్టుకోలేరు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు చేస్తున్నదని బీఆర్‌ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీ ఆర్ ఎస్ తిరగబడితే కాంగ్రెస్ తట్టుకోలేదని కేటీఆర్ హెచ్చరించారు.

కాంగ్రెస్ బెదిరింపులు దాడులు తట్టుకొని 50 శాతం స్థానాల్లో గెలిచిన బీఆర్‌ఎస్ శ్రేణులకు కేటీ ఆర్ అభినందనలు తెలిపారు.

సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గం, లింగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన బీఆర్‌ఎస్ కార్యకర్త ఉప్పల మల్లయ్య కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం నాడు పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం, బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మల్లయ్య కుటుంబాన్ని అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

కేవలం సర్పంచ్, పంచాయతీ ఎన్నికలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతగా భయపడుతోందని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో అద్భుతాలు చేశామని, రుణమాఫీ, ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చామని కాంగ్రెస్ చెబుతున్న మాటలు నిజమే అయితే, ఎన్నికలంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన 420 హామీలు అమలు చేసి ఉంటే ప్రజలే బ్రహ్మరథం పట్టేవారని, కానీ వైఫల్యాల భయంతోనే కాంగ్రెస్ నేతలు దాడులకు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు.



మేము తిరగబడితే రాష్ట్రం ఆగమైతది*

"పదేళ్లు మేము అధికారంలో ఉన్నాం.. ఏనాడూ మీలాగా ఆలోచించలేదు. మేము కూడా మీలాగే ఆలోచించి ఉంటే ఈరోజు కాంగ్రెస్ కార్యకర్తలకు ఈ పరిస్థితి ఉండేదా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, కాంగ్రెస్ నేతలు ఇప్పటికైనా దిక్కుమాలిన రాజకీయాలు మాని, ప్రజలకు మంచి చేయడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు కొనసాగితే, తాము కూడా తిరగబడక తప్పదని, అదే జరిగితే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పి, పరిస్థితి చేయి దాటిపోతుందని హెచ్చరించారు. తెలంగాణలో ఇలాంటి హింసాత్మక సంస్కృతి గతంలో లేదని, ఇది మంచి పద్ధతి కాదని విజ్ఞప్తి చేశారు.

మల్లయ్య కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం

మల్లయ్య చనిపోయిన వెంటనే రావాలనుకున్నా, ఉద్రిక్తతలు పెరగకూడదనే ఉద్దేశంతోనే ఆగానని కేటీఆర్ తెలిపారు. మల్లయ్య కుటుంబానికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, తప్పకుండా మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందని, రాగానే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదేనని కేటీఆర్ మాటిచ్చారు.

బీఆర్‌ఎస్ శ్రేణులకు అభినందనలు

కాంగ్రెస్ పార్టీ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా, మొక్కవోని ధైర్యంతో పోరాడి పంచాయతీ ఎన్నికల్లో సుమారు 50 శాతం సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలను కైవసం చేసుకున్న గులాబీ సైనికులకు కేటీఆర్ శిరస్సు వంచి పాదాభివందనం చేశారు. ప్రజలంతా కేసీఆర్ గారి పాలన కోసం, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మల్లయ్య యాదవ్, బూడిద బిక్షమయ్య, నేతలు భూపాల్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, నరసింహ రెడ్డి, గుజ్జ యుగంధర్ రావు, దయాకర్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఐసీగా గోయేల్

(3వపేజీ తరువాయి)

కేంద్ర హోం శాఖలో సరిహద్దు నిర్వహణ విభాగంలో కార్యదర్శిగా పనిచేశారు. అవిభాజ్య జమ్ముకశ్మీర్ రాష్ట్రంతోపాటు కేంద్రప్రభుత్వంలో పలు పదవుల్లో సేవలందించారు. సెప్టెంబర్ 13వ తేదీన ప్రస్తుత సీఐసీ హీరాలాల్ సమారియా రిటైర్ కావడంతో అప్పట్నుంచి ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలోనే రాజ్‌గోయల్‌ను సీఐసీ పదవికి ఎంపికచేశారు. కొత్త కమిషనర్లు, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించాక దాదాపు 9 ఏళ్ల తర్వాత కమిషన్ గరిష్ట సామర్థ్యంతో పనిచేయనుంది. బుధవారం 8 మందిని ఐసీలుగా సిఫార్సుచేయగా ఇప్పటికే ఆనందీ రామలింగం, వినోద్ కుమార్ తివారీలు ఐసీలుగా పనిచేస్తున్నారు. సమాచార కమిషనర్(ఐసీ) పోస్ట్‌కు ప్రభుత్వం ఎంపికచేసిన 8 మందిలో సీనియర్ పాత్రికేయులు పీఆర్ రమేశ్, అశుతోష్ చతుర్వేది, పెట్రోలియం, సహజవాయువు నియంత్రణ బోర్డ్‌లో లీగల్ సభ్యురాలైన రేలంగి సుధారాణి, మాజీ రైల్వేబోర్డ్ చీఫ్ జయవర్మ సిన్హా, మాజీ ఐపీఎస్ అధికారి స్వాగత్ దాస్, సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ మాజీ అధికారి సంజీవ్ కుమార్ జిందాల్, మాజీ ఐఏఎస్ అధికారి సురేంద్ర సింగ్ మీనా, మాజీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి కుష్వంత్ సింగ్ సేథీ ఉన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమం

**విశ్వంభర, హనుమకొండః**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజున వరంగల్ పశ్చి మ నియోజకవర్గ పరిధిలో ఉన్న 57 వ డివిజన్లో సూమర్ 50 మంది కీలక నాయకులు బిఆర్ఎస్ బీజేపీ పార్టీల నుంచి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈసందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్ల సిద్ధాంతంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ నాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని,గత పాలకుల నిర్లక్ష్యం వలన నగరం 20 ఏళ్లు అభివృద్ధిలో వెనుకబాటుకు గురైందని అన్నారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా కార్యక్రమాలను చేపడుతున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవడం,ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు.అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ కి తగిన గుణపాఠం చేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చ వరకు మాస్టర్ ప్లాన్ కి అనుగుణంగా సెంటర్ లైటింగ్ తో రోడ్డు వెడల్పు పనులకు కట్టుబడిఉన్నామనివెల్లడించారు.సుబేదారి పోలీస్ స్టేషన్ నుంచి సమ్మయ్య నగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైనెజ్ నిర్మాణాలు చేపట్టి వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామనీ తెలిపారు. పార్టీలో చేరుతున్న వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వా నించారు.రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి,పాత కొత్తాం తమ్యం లేకుండా అందరూ సమిష్టిగా పని చేయాలని పిలుపు)నిచ్చారు.రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు.డివిజన్ లలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని ప్రధానంగా ఉన్న సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు.57 డివిజన్ లో ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై పార్టీలోకి వచ్చిన నాయకులకు సాదర స్వాగతం పలికారు.చేరిన వారిలో ప్రధానంగా బిఆర్ఎస్ పార్టీ నుంచి రెండ్ల శ్రీనివాస్ మరియు అనుచరగణం, బిజెపి నుంచి బొంగు కనక లక్ష్మి,పద్మ వారి అనుచరులు పార్టీలో చేరారు. అనం త'రం గోకుల్ నగర్ జంక్షన్ వద్ద గల సివిల్ సప్లై గోదాంలను పరిశీలించారు.రానున్న రోజుల్లో గోదాములను నగర శివారులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు,జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి బంక సరళ సంపత్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు బంక సతీష్,సీనియర్ నాయకులు చంద్రశేఖర్,చంద్రమౌళి,శంకర్,మండల కానుకగా, లలిత, మౌనిక,పద్మ,విజయ,భిక్షపతి,డివిజన్ కాలనీ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పల్లెలను ప్రగతి పథంలో నిలిపిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదే..



**విశ్వంభర హనుమకొండః** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో,కేసీఆర్ సుపరిపాలనలో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు.పంచాయతీ ఎన్నికల్లో భాగంగా దామెర మండలం దుర్గంపేట గ్రామంలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ..అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పల్లెలను అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పల్లెలు ఎలా ఉన్నాయో తేడా గమనించాలన్నారు.కనీసం గ్రామాలలో చెత్త తీసిన వారు లేరన్నారు.గ్రామ పంచాయతీ ట్రాక్టర్లో డీజిల్ పోసే దిక్కులేదనారు.నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ఉండలేని స్థితిలో ఉన్నారు.మళ్ళీ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ కి బుద్ధిచప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఆకట్టుకుంటున్న అద్దాల మేడలు



**విశ్వంభర, ఘట్కేసర్ః** హైదరాబాద్‌కు వెళ్లగానే అద్దాల మేడలు చూపరులను కట్టిపడేస్తాయి. ఒక్కసారైనా వాటిలోకి అడుగుపెట్టాలనే ఆశ కలిగించేలా మంత్రముగ్ధులను చేస్తాయి. ఇప్పుడు ఆ అద్భుతాలన్నింటినీ మించిపోయేలా, నగర శివారు ఘట్కేసర్లో దక్షిణాసియాలోనే ఎత్తైన బంగ్లాను నిర్మించేం దుకు రంగం సిద్ధమవుతోంది. 72 అంతస్తుల భవన నిర్మాణానికి అగ్నిమాపక శాఖ అనుమతులు కోరినట్లు సమాచారం. దూరం నుంచి గాలిలో మెలికలు తిరుగుతున్నట్లుగా కనిపించడం దీని స్పెషల్ ఇది గనక పూర్తి అయితే ఘట్కేసర్ వరల్డ్ రికార్డ్ ఎక్కడం ఖాయమని నిపుణులు అంటున్నారు.

## నూతన సర్పంచ్‌కు సన్మానం

**విశ్వంభర, చిన్న ముప్పారం**



ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామవాసి రెండవ సాధారణ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి 614 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన రాయల్ భవాని శేఖర్ మహబూబాబాద్, జిల్లా మున్నూరు కాపు వైస్ ప్రెసిడెంట్ సురేందర్ దంపతులు ఘనంగా సన్మానించి, అనంతరం, మాట్లాడుతూ, గ్రామానికి ఎనలేని సేవ చేస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి, ఉత్తమ సర్పంచ్ గా ఎన్నిక కావాలని, నిన్ను ఓటు వేసి గెలిపించిన ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ ప్రజల పట్ల మంచి ఆదరాభిమానం కలిగి ఉండాలని కొనియాడారు.

## తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన తనయ



**విశ్వంభర,కేసముద్రంః** అనారోగ్యంతో మృతిచెందిన తండ్రికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించిన ఘటన ఆదివారం అమీనాపురంలో జరిగింది. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం గ్రామానికి చెందిన వంతడుపుల సమ్మయ్య (65) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య రాధా, ముగ్గురు కుమార్తెలు ఉపేంద్ర, గీతా, సరిత లు ఉన్నారు. ఆ ముగ్గురి కుమార్తెలకు పెళ్లిలు అయ్యాయి. కుమారుడు లేకపోవడంతో పెద్ద కుమార్తె ఉపేంద్ర, తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది.

## పదో తరగతి పరీక్షల టైం టేబుల్‌ను సమీక్షించి సవరించాలి

**విశ్వంభర, హైదరాబాద్ః**

2026 ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ పై బాలల హక్కుల సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తంచేసింది.పదో తరగతి పరీక్షలు నెలరోజుల పరీక్షలు పాటు నిర్వహించడంలో ఎలాంటి హేతుబద్ధత లేదని పరీక్షకు పరీక్షకు గరిష్టంగా 4 రోజుల వ్యవధి ఉందని, సాంఘిక శాస్త్రం పరీక్షకు 5 రోజుల వ్యవధి ఉందనీ ఇది విద్యార్థుల మానసిక స్థాయిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ తెలిపారు. పాఠశాల విద్యా డైర క్టర్ చెప్పినట్లు ఈ విధానం విద్యార్థుల మానసిక వత్తిడి తగ్గించడం అటుంచి విద్యార్థుల విలువైన సమయాన్ని వృధాచేయడమే జరుగు తుందని వారున్నారు. పరీక్షకు పరీక్షకు ఎక్కువ రోజుల వ్యవధి ఉండడం వల్ల విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షలు వ్రాయుటకు అవకాశం ఉంటుందని చెప్పడం ఒక "ఆదర్శం" మాత్రమే అని వారున్నారు. ప్రాక్టికల్ గా ఆలోచిస్తే ఇది విద్యార్థులకు విసుగు, నిరుత్సాహం కల్గిస్తుంది. విద్యార్థుల విలువైన సమయాన్ని దుర్వినియోగం చేస్తుంది. విద్యార్థుల్లో ఒకరకంగా తీవ్ర మానసిక ఆందోళన కలిగించనుందని వారు అన్నారు. మార్చి 14 నుండి పరీక్షలు అంటేనే విద్యార్థులు వారం పదిరోజుల ముందునుండే స్కూల్ కు రావడం తగ్గిస్తారు. స్కూల్లో వాళ్లను రప్పించడం ఎత్తయితే వారు తరగతి గది లో కూర్చోవడము గగనం అవుతుంది. ఈ పరిస్థితుల్లో పాఠ్యాంశాలు రివిజన్ చేయడానికి ఉపాధ్యాయులు నానా యాతన పడాల్సి వస్తుంది. ఇది ప్రాక్టికల్ గా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విషయమే. కాబట్టి ఇప్పటిలాగానే పరీక్షకు పరీక్షకు ఎక్కువ రోజులు వ్యవధి లేకుండా త్వరగా పరీక్షలు ముగిసేలా టైం టేబిల్ ను సవరించాలని ఉపాధ్యాయులు,విద్యార్థులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెజారిటీ తల్లిదండ్రులు,విద్యార్థుల, ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరించడం జరిగిందని వారున్నారు. పరీక్షల మధ్య ఎక్కువ విరామం ఉంటే సమయాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉండి,విద్యార్థుల్లో ఒత్తిడి,ఆందోళన పెరుగుతుందన్నారు. కావున నెల రోజుల పాటు నిర్వహించే పరీక్షల షెడ్యూల్ను సమీక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ను బాలల హక్కుల సంక్షేమ సంఘం(బిహెచ్ఎస్ఎస్)విజ్ఞప్తి చేసింది.





## ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**విశ్వంభర. మహేశ్వరం :**

మహేశ్వరం గ్రామ ప్రజలకు అండగా ఉంటానని సర్పంచ్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని మహేశ్వరం సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ అన్నారు.ఈ సందర్భంగా కాకి ఈశ్వర్ మాట్లాడుతూ మహేశ్వరం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా అని కాకి ఈశ్వర్ ముదిరాజ్ అన్నారు.మహేశ్వరం ప్రజలకు అండగా ఉంటూ వారికి సేవ చేయడమే నా లక్ష్యం అని మహేశ్వరం గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్,అన్నారు. మహేశ్వరంలో ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ప్రచారంలో దూసుకు పోతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయడమే నా లక్ష్యమంటూ ప్రచారం చేస్తూ ప్రజలతో మామేకమై ఆప్యాయంగా పలకరిస్తూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. దేశం ఇందిరమ్మ రాజ్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది, నన్ను గెలిపిస్తే గ్రామాభివృద్ధి కి పనిచేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన అన్నారు. గ్రామంలో సమస్యలు పరిష్కారం చేస్తానని అన్నారు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి, సహకారంతో బారిగా నిధులు తీసుకొచ్చే అభివృద్ధి చేస్తానని కాకి ఈశ్వర్,తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేస్తూ గ్రామాభివృద్ధికి ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా అన్ని విధాలుగా అండగా ఉంటూ వారిని ఆదుకుంటానని అన్నారు. మహేశ్వరంలో ఇల్లులు తిరుగుతూ ప్రజలను ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



## ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవాలు నిషేధం

**విశ్వంభర,సూర్యాపేట:**

గ్రామపంచాయితీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రత పరిరక్షణకు మూడు దశల ఎన్నికల పూర్తిస్థాయి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోనే కొనసాగుతుందని లిజిల్లా ఎస్పి కె నరసింహ,పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల మొదటి, రెండో విడతలలో ఫలితాలు ప్రకటించినప్పటికీ, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. మూడు విడతల పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యే వరకు విజయోత్సవాలు కార్యక్రమాలు నిరవ్హిం చారాదు. ఎంసిసి అమల్లో ఉన్నంతకాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలనినియమాలను అతిక్రమించే ఏ చర్యనైనా సహించం. ఉల్లంఘనలు జరిగితే వెంటనే చట్టపరమైన కేసులు నమో దు చేస్తామనిప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. శాంతియుత వాతావరణం నెలకొనడానికి ప్రజలు, నాయకులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.




## ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తా: దివ్య శశిధర్ రెడ్డి



**విశ్వంభర, పరిగి:** మండల పరిధిలోని యాబజిగూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి దివ్య శశిధర్ రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా దివ్య శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్, సైడ్ డ్రైనేజీ పనులు అనేక అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం జరిగిందని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు.గ్రామంలోని ఓటర్లు కత్తెర గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా రన్‌ఫర్ స్వచ్ఛ హైదరాబాద్




**విశ్వంభర కూకట్పల్లిః** నిజాం పెట్ ఎక్స్ రోడ్ మెహఫిల్ హెూటల్ నుండి రన్ పర్ స్వచ్ హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించిన హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ నిషేధించవలెనని క్యారీ బ్యాగులను, ఇతర ప్లాస్టిక్ సామాగ్రిని వాడకూడదని ప్రజలకు సూచించడం జరిగింది. ప్రజలు నిత్యం ఆయురారోగ్యాలతో వ్యాయామం చేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమానికి తోడ్పడిన ఇగ్నేటి సంస్థ నిర్వాహకులు రమేష్ కాలేజీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

## ఉచిత వైద్యశిబిరం



**విశ్వంభర, చైతన్యపురిః** భవాని నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవాని మహిళా మండలిలో యశోద హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కాలనీ సభ్యులు సంతోష్, గిరి, ప్రకాష్, చిన్న మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు జలంధర్, సాయి పాల్గొన్నారు.

## అయ్యప్ప పడి పూజ

**విశ్వంభర, బషీర్ బాగ్:**



హైదరాబాద్‌లోని పోచమ్మ బస్తీ మాసబ్‌ట్యాంక్‌లో రామ్మోహన్ గురు స్వామి ఆధ్వర్యంలో విజయ కృష్ణ, మురళీ కృష్ణ, మహేశ్ గౌడ్, బృంద సభ్యులు నిర్వహించిన 20వ అయ్యప్ప పడి పూజకు టీఎన్జీ వోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, కుటుంబ సభ్యులు హాజరై అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం చేసుకున్నారు. ఉద్యోగులకు మంచి ఆరోగ్యం, సంపద, ఆనందం, విజయం కోసం ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు.

## సర్పంచ్ అభ్యర్థి విస్తృత ప్రచారం

**విశ్వంభర, పరిగిః**



మండల పరిధిలోని యాబాజిగూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి నర్సింలు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్పంచ్ గా నన్ను గెలిపిస్తే గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు నాకు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి భరోసా




**విశ్వంభర, కూకట్పల్లిః** కూకట్ పల్లి నియోజకవర్గం మూసా పెట్ డివిజన్ ప్రగతి నగర్ రోడ్ నెంబర్ 1 యందు ఉపేందర్ అనే వ్యక్తి ఇల్లు అగ్ని ప్రమాద సంఘటన జరిగింది.అద్దెకు ఉన్న బైక్ మెకానిక్ షాప్ అగ్ని కి దహనం అయ్యింది. విషయం తెలుసుకున్న కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇన్చార్జి బండి రమేష్ స్పందించి వెంటనే ఇంటిని సందర్శించి తగు సహాయక సహకారాలు అందిస్తానని బరోసా ఇవ్వడం జరిగింది.

# సమిష్టి పోరాటంతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం: మామిడి సోమయ్య

**విశ్వంభర, ఖమ్మం:**




రాష్ట్రవ్యాప్తంగాజర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి సమస్యలపై సమిష్టి పోరాటం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, రక్షణే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యమని, సంఘం ఏ రాజకీయ పార్టీకీ అనుబంధం కాదని స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాలులో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా తృతీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం నియమ నిబంధనలకు లోబడి బాధ్యతతో పనిచేయాలని, వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణతో సంఘ ప్రతిష్టను పెంచాలని సూచించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించి సంఘానికి భంగం కలిగిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఆయన విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా 'పాత్రికేయుల పోరు యాత్ర' చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం,టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపురావు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి. రాజేందర్, పాల్వాయి జానయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఖమ్మం జిల్లాటీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి. సంతోష్ చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా అంతోటి శ్రీనివాస్, మందడపు మనోహర్, బండి కుమార్, కార్యదర్శిగా నానబాల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా వేల్పుల నాగేశ్వర రావు, కొదుమూరి భద్రయ్య, కుభం రవికుమార్, కోశాధికారిగా అర్వపల్లి నగేష్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా అమరబోయిన ఉపేందర్, కాసోజు శ్రీధర్, కప్పల మధు, కందబోయిన నాగకృష్ణ, వేములకొండ రమేష్, మల్లెల శిల్ప, నైని స్వాతి ఎన్నికయ్యారు. తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వందనపు సామ్రాట్ గుప్తా ఎన్నికయ్యారు.

## నూతన క్రికెట్ అకాడమీ ప్రారంభం

**విశ్వంభర, సంగారెడ్డిః**



సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ పరిధిలో మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వన్ ఛాంపియన్ క్రికెట్ అకాడమీనీ ఆదివారం పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ పరిధిలో క్రీడలకు సంబంధించిన అకాడమీలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.. విద్యార్థి దశ నుండి క్రీడలవై ఆసక్తి పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, బాబ్జీ, కొమరయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి : జాన్ వెస్లీ

**విశ్వంభర, హైదరాబాద్ః**



ప్రభుత్వ గురుకుల హాస్టళ్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆందోళన వ్యక్తం చేసారు. బాగ్‌లింగంపల్లి మైనారిటీ గురుకుల బాలికల హాస్టల్‌లో కలుషిత ఆహారం తినడంతో అస్వస్థతకుగురై కింగ్‌కోఠి, నీలోఫర్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థినీలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పార్టీ నేతలతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టళ్లలో ఆహార నాణ్యత, పర్యవేక్షణను కట్టుదిట్టంగా అమలు చేయాలని తెలిపారు.

## కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలి.. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**విశ్వంభర హనుమకొండః**



బోగస్ హామీలతో గద్దెనెక్కి ప్రజా సంక్షేమం, అభివృద్ధి విస్మరించిన కాంగ్రెస్ కు పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దామెర మండల కేంద్రంలో బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గరిగె కల్పన కృష్ణమూర్తి గెలుపు కోసం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తయినా ఏ ఒక్క హామీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. రెండేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలలలో నమ్మకం కోల్పోయిందని అన్నారు.ప్రజలు కేసీఆర్ నాయకత్వం కోసం, బీఆర్ఎస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.కేసీఆర్ మళ్ళీ రావాలంటే పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆంఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యం

**విశ్వంభర,మహాదేవపూర్ః**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి హసీనా బాను అక్బర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలుస్తున్న వార్డ్ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, తమను సర్పంచ్‌గా గెలిపిస్తే మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారం తో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని, ప్రజలకు స్పష్టమైన హామీలతో కూడిన అభివృద్ధి ప్రణాళికను వెల్లడించారు. రైతుల హక్కుల రక్షణకు తొలి ప్రాధాన్యం. సర్పంచ్‌గా గెలిచిన వెంటనే చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో కాల్వ పనులు చూసే బాధ్యత తనదనిరైతులకు ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు గ్రామ సమస్యలకు తక్షణ పరిష్కారం. గెలుపు అనంతరం నెల రోజుల వ్యవధిలోనే కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం గ్రామంలో కోతులు లేకుండా చూసే పూర్తి బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సామాజిక భద్రత సంక్షేమానికి భరోసా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మఇళ్లు,వితంతు మహిళలకు పెన్షన్లు,వికలాంగులకు పెన్షన్లు వేగంగా అందేలా చర్యలు, విద్యా వికాసానికి గ్రంథాలయం భవనం మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్రత్యేక గ్రంథాలయం భవనం నిర్మాణం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు సహకారంతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. గ్రామ మౌలిక వసతుల అభివృద్ధిప్రతి సంఘానికి కమ్యూనిటీ హాల్ కమ్యూనిటీ డెవలప్మెంట్ పనులు,డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం, వీధి లైట్ల ఏర్పాటు,రైతుల ఆర్థిక బలోపేతానికి కోల్డ్ స్టోరేజ్,రైతులు పండించిన పంటలు నిల్వ లేక నష్టపోవాల్సిన పరిస్థితి లేకుండా రైతుల ఆర్థిక భద్రతకు భరోసాగా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకిఇది మహాదేవపూర్ రైతుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే కీలక నిర్ణయం అవుతుందని పేర్కొన్నారు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు బలమైన అండతో,అధికార కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు సాధిస్తేనే మహాదేవపూర్‌లో అభివృద్ధికి వేగం వస్తుందని స్పష్టం చేస్తూ,మౌలిక వసతులు, సంక్షేమం, ఉపాధి అవకాశాలు, యువతాభివృద్ధి %-% అన్ని రంగాల్లో మహాదేవపూర్‌ను మంథని శాసనసభ్యులు, ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గారి సహకారం తో రాష్ట్రానికే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామనకాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి హసీనా బాను - అక్బర్ ఖాన్ ధీమాగా ప్రకటించారు.

# గెలిపిస్తే గ్రామాన్ని తిరుగులేని అభివృద్ధి చేస్తా : సుదర్శన్ యాదవ్



విశ్వంభర. మహేశ్వరం : మహేశ్వరం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా గెలిపిస్తే గ్రామాన్ని తిరుగులేని అభివృద్ధి చేస్తానని మహేశ్వరం బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థి పోతర్ల సుదర్శన్ యాదవ్‌అన్నారు. స్థానిక ఎన్నికల సందర్భంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం లో సుదర్శన్ యాదవ్ భారీ ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం సర్పంచ్ అభ్యర్థిగా గెలిపిస్తే గ్రామాన్ని తిరుగులేని అభివృద్ధి చేస్తానని బిజెపి పార్టీ సర్పంచ్ అభ్యర్థి పోతర్ల సుదర్శన్ యాదవ్ అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో మహేశ్వరం గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అన్ని రంగాల్లో మన గ్రామాన్నీ అభివృద్ధి చేస్తానని బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి పోతర్ల సుదర్శన్ యాదవ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తానని ముఖ్యంగా గ్రామంలో ఏ సమస్యలున్నా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో పేద ప్రజలకు అండగా ఉంటూ వారికి ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటానని ఇంటి ఇంటికి ప్రచారంలో భాగంగా హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని మీ అమూల్యమైన ఓటు ఫుట్బాల్ గుర్తుకు వేసి ఆశీర్వదించి గెలిపించాలని పాతర్ల సుదర్శన్ యాదవ్ కోరరు. గతంలో గతంలో పార్టీలకు చెందిన వారికి అవకాశం కల్పించారు. బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని ప్రజలు ఫుట్బాల్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సుదర్శన్ యాదవ్ కోరారు. మహేశ్వరం అభివృద్ధి కుంటుపడుతుందని అభివృద్ధి లేక ఇబ్బందులు జరుగుతున్నాయని వెంటనే బిజెపి బలపరిచిన అభ్యర్థి సుదర్శన్ యాదవ్ వార్డు సభ్యులందరినీ భారీ మెజార్టీతో గెలిపించాలని సుదర్శన్ యాదవ్ కోరారు.

## మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి వర్ధంతి

**విశ్వంభర, పటాన్ చెరుః**



సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు గుమ్మడిదల గ్రామ మాజీ సర్పంచ్ కీ.శే. గోసుకొండ నారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం గుమ్మడిదలలోని చంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన కుమారులు గోసుకొండ బాల్‌రెడ్డి, గోసుకొండ శ్రీనివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వర్ధంతి సమావేశంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పాల్గొని నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రామ అభివృద్ధి, ప్రజాసేవల పట్ల ఆయన చూపిన పట్టుదల, సేవా భావాన్ని ఈ సందర్భంగా స్మరించారు. కార్యక్రమంలో సద్ది విజయ భాస్కర్ రెడ్డి, ఇందల బాల్ రెడ్డి , బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి,వెంకట్ రామ్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, సత్యనారాయణ, నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నారాయణరెడ్డి, నల్లారెడ్డి ,మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, మహిపాల్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.

## ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

**విశ్వంభర, హైదరాబాద్ః**

మున్ననూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ బలపరిచిన కాట్రాజ్ పద్మని ఉంగరం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరినారు మున్ననూర్ గ్రామ ప్రజలకు ఈ ఎన్నికల్లో మార్పు మీ చేతుల్లో ఉంది మంచి కోసం మీ భవిష్యత్తు కోసం ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని మన గ్రామ సమస్యలకు బిజెపి వద్ద పక్క ప్రణాళిక సిద్ధంగా ఉంది మురుగు కాలువలు మంచి రోడ్లు పరిశుభ్రమైన వాతావరణం వీధిలైట్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామని మన గ్రామ సమస్యలు నా సమస్యలుగా గుర్తించి శాశ్వత పరిష్కారం చూపిస్తానని బిజెపి బలపరిచిన అభ్యర్థి కాట్రాజ్ పద్మ శివగంగా గారు తెలియజేశారు ఈ ప్రచార కార్యక్రమంలో ఎలక్షన్ ఇంచార్జ్ రాష్ట్ర నాయకులు మండికారి బాలాజీ గారు ఎలక్షన్ పోయి ఇన్చార్జి రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ ముక్తాల రేలయ్య గారు నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి నాగరాజు గారు అమ్రాబాద్ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ పుల్జాల శేఖర్ పుల్జాల సరస్వతి పోలం బాలకృష్ణ పేరుమల ప్రసాద్ పగిడి పాల అనిల్ మడిమల్కల ఉదయ్ ఇమ్మడి తిరుమలేష్ ఆలేటి శ్రీకాంత్ ఎండి నిజాం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

**విశ్వంభర, ముషీరాబాదు :**



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) హైదరాబాద్ నగరంలో ఉద్యమ నిర్మాతల నుంచి నేటి నాయకత్వం వరకు బాధ్యతలు నిర్వహించిన నేతల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గోల్కొండ చౌరస్తాలోని ఐద్వా కార్యాలయంలో జరిగింది. జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యమ ప్రారంభ దశలో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ హైదరాబాద్‌లో మహిళా సంఘాన్ని నిర్మించిన నాయకత్వం చేసిన కృషి మరువలేనిదని ఆమె అన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, సాధ్యమైన మార్గాల్లో ఉద్యమంలో భాగస్వాములవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళల హక్కులపై దాడి చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.సమావేశంలో మాట్లాడిన నాయకులు 1970లో హైదరాబాద్ నగర కమిటీ ఏర్పాటుతో ప్రారంభమైన ఉద్యమం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విస్తరించిందని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జరగనున్న 14వ జాతీయ మహాసభల విజయానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి జాతీయ మహాసభల సందర్భంగా ఎగ్జిబిషన్లు, సెమినార్లు తదితర కార్యక్రమాల కోసం కమిటీలను ఏర్పాటు చేస్తామని, అందరూ భాగస్వాములవ్వాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణ జ్యోతి, ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి, సహాయ కార్యదర్శి కే. నాగలక్ష్మి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దౌపాటి అశ్విని గెలుపునకు కృషి

**విశ్వంభర, బషీర్ బాగ్:**



హైదరాబాదులో నివాసం ఉంటున్న జనగామ జిల్లా, దేవరుప్పుల మండల, ధర్మపురం గ్రామనికి చెందిన ప్రజలు సమిష్టిగా కలిసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దౌపాటి అశ్విని రవి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆదివారం హైదరాబాదులో ఏర్పాటు చేసిన సమావేశంలో దౌపాటి అశ్విని రవి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేస్తామని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దౌపాటి అశ్విని రవి, తాజా మాజీ సర్పంచ్ బజ్జూరి అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బింగి యాకయ్య, కన్నెబోయిన రవి, బొబ్బల నరేష్, వంగాల అనిల్, ఏసమల్ల శీను, పిట్టల అంజయ్య, నర యాదయ్య, బొంత యాదయ్య, వల్లాల సంపత్, బజ్జూరి రవి, చిత్తలూరి యాకయ్య, మోత్కుపల్లి రాములు, బజ్జూరి రాజు, ఖమ్మంపాటి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## రైలు ఢీకొని మహిళ మృతి

**విశ్వంభర, ఘట్కేసర్:**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ ఆదివారం మృతి చెందింది.యంనంపేట ఓఆర్ఆర్ వంతెన సమీపంలో పట్టాలు దాటుతుండగా కాకినాడ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ఢీకొంది ఘటన స్థలంలోనే ఆమె మృతి చెందింది .రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు.

## పెద్ద మాదారం గ్రామాన్ని దత్తత తీసుకుంటా:

**విశ్వంభర,పరిగి:**



మండల పరిధిలోని పెద్ద మాదారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చిలుకమరి వెంకటేష్ కు మద్దతుగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పలువురు బి ఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే ప్రభుత్వమని, కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి వెంకటేష్ చెప్పినట్లు జీడిగడ్డ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడమే కాకుండా, గ్రామానికి 120 ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వటం జరుగుతుందని, గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలు రింగు గుర్తుకు ఓటేసి వెంకటేష్ ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు లాలు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు సాయిరాం, రమేష్, తౌరియా నాయక్, మాధవరెడ్డి, వెంకటరామిరెడ్డి, తిరుమల్ రెడ్డి, రాములు, మంజుల, స్వర్ణలత, బాల్ రెడ్డి,చంద్రయ్య, గోపాల్, మహేందర్, చెన్నయ్య,నర్సింలు, ఆనందం, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ యశోద పుస్తకాల ఆవిష్కరణ

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :**



రచయిత్రి డాక్టర్ యశోద కథల సంపుటి పాఠకులకు మనశ్శాంతిని కలిగిస్తుందని పూర్వ బిసి కమిషన్ చైర్మన్ బి.ఎస్ రాములు అన్నారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ యశోద గొట్టిపర్తి రచించిన యశోకాంక్ష కథల సంపుటి యశోగీతిక యశో బాలానందం, శ్రీ వేంకటేశ్వర స్వామి తో నేను పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం కవి విమర్శకులు కళా రత్న డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్ రాములు పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడుతూ ఉపదేశ ధోరణి లేకుండా ఆధ్యాత్మిక భావనలు, జీవన సత్యాలను కథల ద్వారా సహజంగా చెప్పడం విశేషమన్నారు. బాల సాహిత్య రచనలు పిల్లల్లో నైతిక విలువలు, మానవీయతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నేటి తరానికి ఇలాంటి విలువాధారిత సాహిత్యం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవి జల్దీర్ విద్యాధర్,డాక్టర్ రాధాకుసుమ ఉషారాణి శాంతి శ్రీ పద్మశ్రీ లత, శ్రీనివాస్, శ్యామ్, రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రచయిత్రిని పలువురు అభినందిస్తూ సత్కరించారు.

## ఆశీర్వదించి.. గెలిపించండి..

**విశ్వంభర, మహదేవపూర్ః**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ గ్రామములో మేము ఇద్దరము ఇక్కడే జన్మించాము. మాకు మహదేవపూర్ మండల ప్రజలు కుల మతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ముందుకు వచ్చి తమ వంతు బాధ్యతగా మాకు ఎన్నో పదవులు ఇచ్చారు . ప్రజలు అందరూ కలిసి మాకిచ్చిన ప్రతి అవకాశాన్ని ప్రజల కోసం పనిచేసి ఈ రోజు మహదేవపూర్ గ్రామసర్పంచ్ గా ఇక్కడే పుట్టి పెరిగిన నేను మీ ఆడబిడ్డగా ఒక సారి సర్పంచ్ గా అవకాశం ఇస్తే నేను ఐదు సంవత్సరాలు మీ ఇంటి ఆడబిడ్డ లాగా ఉంటాను. నేను గతములో మన ఊరు లో మైసమ్మ కొలుపు సందర్భంగా గ్రామదేవతలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని బొడ్డురాయి ప్రతిష్ట కార్యక్రమంలో ఉపవాసముతో పాల్గొని అమ్మవారికి పూజలు చేశాను ఒక్కసారి ఆలోచించండి. అక్కలారా అన్నలారా మతం పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రాలేదు మహదేవపూర్ లో ఉన్న పతి ఇంటినుండి నాకు ఓటు వేసి గెలిపించారు ఇప్పుడు కూడా అదే మంచి మనసుతో నన్ను ఆశీర్వదించండి ప్రతి ఇంటి నుండి ఓటు వేసి గెలిపించండి మేము పుట్టింది ఇక్కడే సచ్చేదే ఇక్కడే కొందరు కావాలని లేనివి ఉన్నట్టుగా సోసల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆర్యవైశ్యులు రాజకీయాల్లోకి రావాలి

## ప్రజా సంక్షేమం కోసం అభివృద్ధికి కృషి చేయాలి
## పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ




**విశ్వంభర, చందానగర్:** చందానగర్ డివిజన్ క్రిస్టల్ గార్డెన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా పబ్బా మల్లేష్ గుప్తా, జనరల్ సెక్రటరీగా కైలాస్ శ్రీనివాస్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంప సత్యనారాయణ, ట్రెజరర్‌గా రాచురి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల, డివిజన్, కల్చరల్ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ, మాజీ పర్యాటక శాఖ చైర్మన్, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై నూతన కార్యవర్గానికి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ మాట్లాడుతూ, ఐవిఎఫ్ చేస్తున్న సేవలు మరవలేనివని ప్రశంసించారు. ప్రజాసేవలో ఐవిఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని, ఆర్యవైశ్యులు అంతా ఐక్యంగా ముందుకు వచ్చి క్రియాశీలక రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, ఐవిఎఫ్ సమాజ సేవకు అంకితమైన సంస్థ అని కొనియాడారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం చేయడం, తలసేమియా బాధితులకు రక్తదాన శిబిరాల ద్వారా రక్తం అందించడం, ఉన్నత విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించడం వంటి సేవలను ఐవిఎఫ్ నిర్వహిస్తోందని వివరించారు. శేరిలింగంపల్లి ఆర్యవైశ్య సంఘం సభ్యుడు పబ్బా మల్లేష్ గుప్తా చేపట్టిన ప్రతి కార్యక్రమం వేలాది మంది స్వచ్ఛందంగా పాల్గొనడంతో విజయవంతమవుతుందని అభినందించారు. అలాగే, శేరిలింగంపల్లి నియోజకవర్గ క్రియాశీలక రాజకీయాల్లో పబ్బా మల్లేష్ గుప్తా ప్రవేశించాలని సూచించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేటర్ ఎన్నికల్లో కనీసం రెండు డివిజన్లను ఆర్యవైశ్యులకు కేటాయించేలా కాంగ్రెస్ అధిష్టానంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఐవిఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఎన్నికైన పబ్బా మల్లేష్ గుప్తా మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన ఐవిఎఫ్ ఆర్యవైశ్య సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యులు కేవలం వ్యాపారస్తులుగానే కాకుండా రాజకీయాల్లో కూడా రాణించాలని, యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు ఇస్తూ రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేటర్ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆర్యవైశ్యులకు రెండు డివిజన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్జల యోగానంద్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, రఘునాథ్ రెడ్డి, గురు చరణ్ దుబే, ఐవిఎఫ్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ ర్యాలీలో పాల్గొన్న మెట్టు సాయి కుమార్




**విశ్వంభర, ఢిల్లీ:** ఓటు చోరికి వ్యతిరేకంగా ఏఐసీసీ ఢిల్లీ రాం లీల మైదానంలో చేపట్టిన ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. ఖాలీద్ సైఫుల్ల. మలక్పేట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే. షేక్ అక్బర్ . మహమ్మద్ ఇర్ఫాన్ ఖాద్రీ. మహమ్మద్ ఇజాజ్. పాల్గొనడం జరిగింది.

## దుర్గా మాత ఆలయంలో అన్నదానం

**విశ్వంభర, నల్లకుంట :**



నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన దుర్గా మాత ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన స్వయంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డిస్తూ సేవలందించారు.

## త్రిపురారం మండలం లో గెలుపొందిన సర్పంచులు వీరే

**విశ్వంభర, త్రిపురారం**

త్రిపురారం మండలం లో 32 గ్రామపంచాయతీల లో 8 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 24 గ్రామపంచాయతీలలో గెలుపొందిన అభ్యర్థులుత్రిపురారం మండలం లోకాంగ్రెస్ - 9 మంది అభ్యర్థులు, కాంగ్రెస్ రెబల్ -ముగ్గురు అభ్యర్థులు, బి ఆర్ ఎస్ - పదిమంది, ఇండిపెండెంట్ -ఇద్దరు గెలుపొందడం జరిగింది. గెలుపొందిన వారి వివరాలు ఇలాఉన్నాయి. 1 త్రిపురారం- బైరం లక్ష్మి బిఆర్ ఎస్,2 సత్యనారాయణ పురం- వేగుళ్ల శ్రీలత కాంగ్రెస్ రెబల్,3 నీలాయి గూడెం- వట్టి కోట మధు కాంగ్రెస్ రెబల్, 4 అంజన పల్లి - వెంకటేశ్వర్లు కందుల కాంగ్రెస్, 5 రాగడప- సఫియా బేగం బిఆర్ఎస్, 6 కాపు వారి గూడెం- పానుగోతు బిఆర్ఎస్,7 లచ్యతండా- పానుగోతు మంగ బి ఆర్ ఎస్,8 పలుగు తండా- మూడవత్ సునీత కాంగ్రెసు, 9 డొంక తండా - దానవత్ బిచ్చు బి ఆర్ ఎస్, 10 అప్పలమ్మ గూడెం- దానావత్ శ్రీదేవి కాంగ్రెస్, 11 బోర్రయి పాలెం- రాయనబోయిన పుల్లయ్య బిఆర్ఎస్, 12 రాజేంద్రనగర్ - దానవత్ రమేష్ బి ఆర్ ఎస్, 13 మాటురు- దానావత్ వెంకటేశ్వర్లు కాంగ్రెస్, 14 చెన్నై పాలెం - బొలిశెట్టి రమేష్ కాంగ్రెస్, 15 బెజ్జికల్- ఉబ్బపల్లి సతీష్ కాంగ్రెస్ రెబల్, 16 బాబు సాయి పేట- కలగాని అరుణ కాంగ్రెస్, 17 పెద్ద దేవులపల్లి- గుండెబోయిన వెంకటేశ్వర్లు బిఆర్ఎస్, 18 కంపసాగర్- కొండ రమాదేవి కాంగ్రెస్, 19 దుగ్గేపల్లి- మేకల వెంకన్న ఇండిఎండెంట్, 20 జి.అన్నారం- చిత్రం శివమ్మ ఇండిపెండెంట్, 21 కామారెడ్డి గూడెం- పాపకంటి సుష్మా బి ఆర్ ఎస్, 22 కొణతాల పల్లి- ధూపాటి సైదమ్మ బిఆర్ఎస్, 23 కంపల పల్లి- పనస స్వప్న కాంగ్రెస్, 24 బృందావన పు రం- మందాడి రమణారెడ్డి కాంగ్రెస్. ఆదివారం జరిగిన ఎలక్షన్లో సర్పంచ్ అభ్యర్థులుగా గెలుపొందడం జరిగింది.

## కాకి ఈశ్వర్ గెలిపిస్తే మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి

**విశ్వంభర, మహేశ్వరం :**



మహేశ్వరం సర్పంచ్ అభ్యర్థి కాకి ఈశ్వర్ ను గెలిపిస్తేనే అభివృద్ధి జరుగుతుందని మాజీ జెడ్పి చైర్మన్ అనిత హరినాద్ రెడ్డి, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల సందర్భంగా మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకి ఈశ్వర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భారీగా ప్రజలతో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలను ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. అనంతరం కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన మాజీ జెడ్పి చైర్మన్ అనిత హరినాద్ రెడ్డి టీపీసీసీ సభ్యుడు టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాకి ఈశ్వర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత పది సంవత్సరాలు గా మహేశ్వరం అభివృద్ధి జరగకుండా కుంటు పడిందని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున పార్టీ అభ్యర్థి గెలిపిస్తే సంక్షేమ పథకాలు అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్,ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందిస్తుందని కాకి ఈశ్వర్ ను గెలిస్తే మహేశ్వరం గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందని పేద ప్రజల కోసం ఇండ్లు లేని నిరుపేదల కోసం 10 ఎకరాల స్థలం తీసుకొని ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు కట్టిస్తానని కాకి ఈశ్వర్ హామీ ఇచ్చారు. అభివృద్ధి కోసం కాకి ఈశ్వర్ ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తున్న వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి

**విశ్వంభర, గజ్వేల్:** గజ్వేల్ మండలం ముట్రాజ్ పల్లి వద్ద బైకు అదుపుతప్పి డివైడర్ కు ఢీకొట్టడంతో బైకుపై వెళ్తున్న వ్యక్తి భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కోముడిబండ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ అని సమాచారం .

## కౌకుంట్లలో కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం

విశ్వంభర, కౌకుంట్ల:



మహబూబ్ న గర్ జిల్లాలోని కౌకుంట్ల మండలంలో జరిగిన సర్పంచ్ నామినేష న్లలో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. బిజెపికి 431 ఓట్లు, టిఆర్ఎస్ కి 875 ఓట్లు, బ్యాట్ గుర్తుకు 60 ఓట్లు, బాలు గుర్తుకు పది ఓట్లు, సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి ఉల్లి నరేష్ 1412 ఓట్లతో విజయం దుందిబి మోగించారు.

## సర్పంచ్ శ్రీకాంత్ విజయం

**విశ్వంభర,నిజామాబాద్:**



నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం దుర్గా నగర్ గుట్ట కింద తండా, దుర్గా నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా రాథోడ్ శ్రీకాంత్ 25 సంవత్సరాల యువకుడు భారీ మెజార్టీతో గెలుపొందాడు 57 ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు.

## మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన కార్పొరేటర్

**విశ్వంభర, మియాపూర్:**




మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ గారు మాట్లాడుతూ%% కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ , యశోద హాస్పిటల్స్ సంయుక్తంగా అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రజలకు సేవలందించడం అభినందనీయమని తెలిపారు. మారుతున్న జీవనశైలి, పర్యావరణ మార్పుల కారణంగా ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారని, ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం, యోగా, ధ్యానం లేదా నడక చేయాలని సూచించారు. అలాగే తాజా ఆకుకూరలు, సీజనల్ పండ్లు, పాలు, చేపలు, గుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆల్కహాల్, పొగాకు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అనారోగ్య సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలని కోరారు. ఆహారంలో సమయపాలన కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిర నిర్వాహకులు మహేష్, మయూరి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కే. వెంకటరామరాజు, కిషోర్, హరికృష్ణ, ప్రవీణ్ రెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, రమణారెడ్డి, కృష్ణ కుమార్, భాష పాల్గొన్నారు.

## కేసారం సర్పంచ్‌గా సాయిరెడ్డి విజయం

**విశ్వంభర,నిజామాబాద్:**




నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం కేసారం గ్రామానికి చెందిన సాయి రెడ్డి వారి మెజార్టీతో గెలుపొందారు. అనంతరం వార్డ్ మెంబర్లకు గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరికి సేవ చేసుకునే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అనంతరం రోడ్ షో నిర్వహించారు. ప్రతికడపగడప కు వెళ్లి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రామడుగు సర్పంచ్‌గా రమేష్ గౌడ్ విజయం

**విశ్వంభర,నిజామాబాద్:**



నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం రామడుగు గ్రామానికి చెందిన రమేష్ గౌడ్ 450 మెజార్టీతో గెలుపొందారు. గ్రామంలో ప్రజలకు ప్రజాప్రతినిధులకు ఈ యువకులకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన రోడ్ షో నిర్వహించి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కార్యకర్తలు వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్ రాజేశ్వర్, వార్డ్ మెంబర్ సునీత రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌కు సన్మానం



**విశ్వంభర, నాగారం:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నాగారంమండలం శాంతినగర్ గ్రామం లో స్థానిక సమరంలో సర్పంచ్ గా గెలుపొంది న అనంతరం ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో శాసన సభ్యులు శ్రీ మందుల సామెల్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నశాంతినగర్ గ్రామ నూతన సర్పంచ్ షహినయాకుబ్ వలి కి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతినగర్ గ్రామానికి అన్ని విధాలుగా నిధులను, ఊరు అభివృద్ధిని చేస్తానని అన్నారు. వారి వెంట మండల మైనారిటీ అధ్యక్షులు షేక్ సైదులు , షేక్ జాన్,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కమల్ , మహబూ ,హుస్సేన్,తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు అక్బర్ పాషా, తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్ అక్బర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు భాష,నశీర్, నాగారం మండల యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అక్బర్ గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి బైరంలక్ష్మీ విజయం

**విశ్వంభర, త్రిపురారం**



రెండో విడత సర్పంచ్ ఎలక్షన్లు గాను త్రిపురారం మండల కేంద్రంలో 32 గ్రామ పంచాయతీలకు ఎనిమిది గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 24 గ్రామ పంచాయతీలకు ఆదివారం రోజున పోలింగ్ నిర్వహించగా త్రిపురారం మండలంలో పార్టీ ల వారిగా 9మంది కాంగ్రెస్ అభ్యర్థులు,3 గురు కాంగ్రెస్ రెబల్స్, పది మంది బిఆర్ఎస్ అభ్యర్థులు,ఇండిపెండెంట్ అభ్యర్థులు ఇద్దరు ఎన్నిక కావడం జరిగింది. త్రిపురారం సర్పంచ్ అభ్యర్థి 223 ఓట్లతో బైరం లక్ష్మి కృష్ణ బిఆర్ఎస్ పార్టీ తరపున విజయం సాధించడం జరిగింది. త్రిపురారం మండలంలో మేజర్ గ్రామపంచాయతీ కాగా ఆరుగురు అభ్యర్థులు సర్పంచ్ బరిలో పోటీలో పాల్గొనగా ఇద్దరు ఇండిపెండెంట్లు గాను, నలుగురు ప్రధాన పార్టీల నుంచి పోటీలో పాల్గొనగా ఆదివారం జరిగిన సర్పంచ్ ఎలక్షన్స్ ఫలితాల లెక్కింపులో ఉత్కంఠ భరితంగా కొనసాగింది. అన్ని రౌండ్ ముగిసే సరికి బిఆర్ఎస్ అభ్యర్థి బైరం లక్ష్మి కృష్ణ 232 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అలాగే గ్రామపంచాయతీలో 14 వార్డులకు గాను ఎనిమిది వార్డులు కాంగ్రెస్ కైవసం చేసుకోగా ఆరు వార్డులు బీఆర్ఎస్ గెలుపొందింది. ఈ సందర్భంగా బైరం లక్ష్మీ కృష్ణ మాట్లాడుతూ.. నన్ను గెలిపించిన ప్రతి ఒక్క ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫణిగిరి సర్పంచ్ ఎర్ర సావిత్రికి సన్మానం

**విశ్వంభర, నాగారం:**



మొదటి విడత స్థానిక ఎన్నికలలో నాగారం మండలంలో పరిధిలోని ఫణిగిరి సర్పంచ్ ఎర్ర సావిత్రి యాదగిరి ఆదివారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ను కలిసి క్యాంపు కార్యాలయంలో పుష్పగుచుఅందజేశారు .మండలంలోని అత్యధిక మెజార్టీతో 11 వార్డుసభ్యులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు ను కైవసం చేసుకుని, వల్లాల భాను ప్రకాష్ ను ఉపసర్పంచ్ ను వారు అభినందించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ గెలుపొందిన సర్పంచ్ వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నాగారం మండలం లో 1114 ఓట్ల అత్యధిక మెజార్టీ తో ఫణిగిరి గడ్డపై ఎర్ర సావిత్రి యాదగిరి విజయం అని,( ఫణిగిరి ప్రజల విజయం) గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని అని అన్నారు. ఆయన వెంట నాగా రం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పానుగంటి నరసింహారెడ్డి, రామిరెడ్డి, నాతి వెంకన్న, ఆలకుంట్ల బాలకృష్ణ, దారం రమేష్, వెంకన్న శ్రీనివాస్, లింగయ్య, వార్డు సభ్యులుఉన్నారు.

## ఈటూరు గ్రామానికి ఇచ్చిన హామీలు నెరవేరుస్తా...
## సర్పంచ్ వంగూరి దామోదర్

**విశ్వంభర, నాగారం:**



ఎన్నికలకి ముందు తన గ్రామ ప్రజలకి ఇచ్చిన హామీలన్నీ ఏ ఒక్క దాన్ని వదలకుండా విడుతల వారీగా అమలు చేస్తానని ఇటీవల ఎన్నికైన ఈటూరు గ్రామ సర్పంచ్ వంగూరి దామోదర్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్న ఊరు కన్న తల్లి లాంటిదని , ఊరికి సేవ చేసే భాగ్య సర్పంచ్ గా అవకాశం దక్కడం అనేది ఒక గొప్ప విషయమని అన్నారు .గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతోనే గ్రామంలోకి వచ్చి తనకి ఉన్న దాంట్లో నుంచి ఊరు అభివృద్ధికి కొంత ఖర్చు చేశానని. తనకి ఎప్పుడు ప్రజా సేవే ముఖ్యమని ప్రజలకి నిరంతరం అందుబాటులో ఉండటం వారి సమస్యలు వినటం మనకి తోచిన పద్ధతుల్లో పరిష్కరించాటమే ముఖ్యమని అన్నారు. గత మూడు నాలుగేళ్లుగా ఈటూరు గ్రామంలో తాను చేస్తున్న అభివృద్ధి మరియు సేవ కార్యక్రమాలని చూసి ప్రజలు తనకు ఈ అవకాశం కల్పించారని అన్నారు.సర్పంచ్ పదవిని బాధ్యతగా నిర్వహించి ఇచ్చిన హామీలన్నీ విడుతల వారీగా అమ లు చేస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి వైపు నడిపి ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని అన్నారు. ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన ఈటూరు గ్రామానికి ప్రజలకి రుణపడి ఉంటానని అన్నారు.

## రామన్నపేట మండల సర్పంచ్‌లు వీరే..

**విశ్వంభర, రామన్నపేట:**

యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామ పంచాయతి ఎన్నికల్లో భాగంగా రెండవ విడత పోలింగ్ లో రామన్నపేట మండలంలోని 24 గ్రామాల్లో 11 మంది కాంగ్రెస్ అభ్యర్థులు, 6 మంది బి.ఆర్.ఎస్ అభ్యర్థులు, ఇద్దరు సిపిఎం, ఒక్కరు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. గ్రామాల వారీగా చూస్తే, లక్ష్మాపురం గ్రామంలో బి.ఆర్.ఎస్ అభ్యర్థి పులిపల్పుల సునీత వీరస్వామి, కొత్తగూడెం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి బద్దం యాదమ్మ యాదగిరి, నీర్నెముల గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కందిమల్ల గోపాల్ రెడ్డి, తుమ్మలగూడెం గ్రామంలో బి.ఆర్.ఎస్ అభ్యర్థి గర్దాసు విక్రం, బోగారం గ్రామంలో బి.ఆర్.ఎస్ అభ్యర్థి కూనూరు సాయి కుమార్ గౌడ్, వెల్లంకి గ్రామంలో బి.ఆర్.ఎస్ అభ్యర్థి ఈడెం రాధా శ్రీనివాస్, సర్నేని గూడెం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి గంగదేవి స్వామి, దుబ్బాక గ్రామంలో సిపిఎం అభ్యర్థి గట్టు నర్సింహ, మునిపంపుల గ్రామంలో సిపిఎం అభ్యర్థి బొడ్డుపల్లి వెంకటేశం, ఎన్నారం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి వెల్లపల్లి జనని నర్సింహరావు, కుంకుడుపాముల గ్రామంలో బి.ఆర్.ఎస్ అభ్యర్థి గొలుసుల సత్తయ్య, నిదానపల్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి నారపాక మాధవి యాదయ్య (ఏకగ్రీవం), బి.తుర్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వరలక్ష్మి పిచ్చిరెడ్డి, ఇస్కిళ్ళ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి పైళ్ళ చందన వెంకట్ రెడ్డి, పల్లివాడ గ్రామంలో బి.ఆర్.ఎస్ అభ్యర్థి కంభంపాటి శ్రీను, రామన్నపేట గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి గరిక సత్యనారాయణ, కొమ్మాయిగూడెం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి మారెపల్లి మల్లారెడ్డి, జనంపల్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి బండ అంజిరెడ్డి, సూరారం గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి బంటిక శ్రీను (ఏకగ్రీవం) లు గెలుపొందారు. 4 గ్రామాలు సిరిపురం, బాచుప్పల, కక్కిరేణి, ఉత్తటూరు గ్రామాల ఫలితాలు తెలియాల్సి ఉంది.

# సత్యమనే నినాదంతో.. కేంద్ర సర్కారును గద్దెదించుతాం: రాహుల్ గాంధీ

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** సత్యమనే నినాదంతో మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును గద్దెదించుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అధికారంలో ఉన్నవారు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంతో కలిసి ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు."తాము దేశం కోసం పనిచేస్తున్నామని, మోదీ కోసం కాదనేది ఎన్నికల సంఘం గుర్తుంచుకోవాలి. బిహార్ ఎన్నికల వేళ బీజేపీజి రూ.10 వేల చొప్పున పంచినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరోవైపు.. ఎన్నికల సంఘంపై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చింది. మేం అధికారంలోకి వస్తే దాన్ని మార్చి.. ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటాం. సమయం పట్టినా.. చివరకు సత్యమే గెలుస్తుంది. మోడీ, అమిత్ షాలను ఓడించేందుకు.. సత్యం, అహింస మార్గంలో పోరాడతాం" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**ఆ విషయం దేశం మొత్తానికి తెలుసు: ప్రియాంక గాంధీ**

దేశంలో ఎన్నికలను సక్రమంగా నిర్వహించడం లేదని, అడుగడుగునా అనుమానాలు రేకెత్తుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. బిహార్ ఎన్నికల సమయంలో రూ.10 వేలు ఇవ్వడాన్ని ఈసీ పట్టించుకోలేదని, ఇది ఓటు చోరీ కాదా? అని ప్రశ్నించారు. బిహార్‌లో ఓడిపోయినందుకు నిరుత్సాహపడకూడదని, ఓట్ల చోరీ ద్వారా భాజపా గెలిచిందని దేశం మొత్తానికి తెలుసన్నారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికల్లో పోటీ చేయాలంటూ భాజపాకు సవాల్ విసిరారు. దేశంలోని అన్ని సంస్థలను కేంద్రం ముందు లొంగిపోయేలా చేస్తున్నారని, ఈ అణచివేతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.



# ఆపరేషన్ సిందూర్ 2.0 అనివార్యంగా కనిపిస్తోంది: విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** చైనా, తుర్కియేలతో అంటకాగుతూ కశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్ ఇంకా ఎగదోస్తున్న నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్ 2.0' అనివార్యంగా కనిపిస్తోందని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దుశ్యంత్ సింగ్ అన్నారు. భారత సాయుధ దళాలు దీనికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఇప్పటికీ అస్థిరంగా ఉందని, ఎల్‌వోసీ వెంబడి పాక్ పదే పదే ఉల్లంఘనలకు పాల్పడుతోందని మండిపడ్డారు. 'సెంటర్ ఫర్ ల్యాండ్ వార్‌ఫేర్ స్టడీస్' డీజీగానూఉన్న ఆయన.. గుజరాత్‌లోని వాయుసేన నైరుతి ఎయిర్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈమేరకు ప్రసంగించారు."ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు. యుద్ధాన్ని నిర్వహించే విషయంలో కొత్త అధ్యాయానికి నాంది. మన ప్రత్యర్థితో భవిష్యత్తులోనూ వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. చైనా, తుర్కియేల మద్దతుతో కశ్మీర్ వివాదంపై పాక్ రెచ్చగొడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ సిందూర్ 2.0' అనేది అనివార్యం. దాని కోసం ఎంత త్వరగా సిద్ధమైతే.. అంత మంచిది. 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్ బలహీనతలను బయటపెట్టింది. 1971 యుద్ధం తర్వాత మొదటిసారి మన త్రివిధ దళాలు సమన్వయంతో పనిచేశాయి. సైనికపరంగా సత్తా చాటేందుకు రాజకీయ స్పష్టత దోహదపడింది" అని తెలిపారు.అంతర్జాతీయ వేదికపై దేశ వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టడంలో భారత్ వెనుకబడి ఉందన్నారు. "చైనా సోషల్ మీడియా నెట్‌వర్క్‌ల మద్దతుతో పాకిస్థానీ ఇన్‌ఫ్లుయెన్సర్లు టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో రెచ్చిపోయారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత ప్రభుత్వ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులు ఏడు రెట్లు పెరిగాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ దాదాపు 40కోట్లసైబర్ దాడులు ఎదుర్కొంది. ఒకవేళ అవి విజయవంతమైతే.. ఆర్థిక సంక్షోభానికి దారితీసేది. భారత్‌కు మెరుగైన జాతీయ భద్రతా వ్యూహం అవసరం. ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత రంగాలను సంస్కరించాలి. రక్షణ వ్యయాన్ని జీడీపీలో 3 శాతానికి పెంచాలి" అని సూచించారు."వివాదాల సమయంలో సమన్వయంతో కూడిన ప్రచార వ్యవస్థ అవసరం. వ్యూహాత్మక కమ్యూనికేషన్‌లను మెరుగుపర్చాలి. ఎందుకంటే ఇవి భారత్ ఇమేజ్‌ను ప్రభావితం చేస్తాయి. భారత యుద్ధవిమానాల గురించి వైరల్ కథనాలను ఎదుర్కోవడంలో సాంకేతిక అనుసంధానం



విఫలమైంది. తప్పుడు సమాచారాన్ని ట్రాక్ చేసేందుకు ఏఐని ఉపయోగించాలి" అని దుశ్యంత్ సింగ్ పేర్కొన్నారు. 'సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్' డీజీ, విశ్రాంత ఎయిర్ వైస్ మార్షల్ అనిల్ గోలాని మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో చైనా–పాక్ స్నేహం బయటపడిందని, డ్రాగన్ తన ఆయుధాలను పరీక్షించేందుకు ఈ సంఘర్షణను ఉపయోగించుకుందన్నారు.

## విమానంలో ప్రయాణికురాలికి అస్వస్థత.. సీపీఆర్ చేసి కాపాడిన మాజీ ఎమ్మెల్యే



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** విమానం గాల్లో ఉండగా.. ప్రయాణికురాలు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయిన ఆమెకు అదే విమానంలో ప్రయాణిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలి నింబాల్కర్ సీపీఆర్ చేసి కాపాడారు. అంజలిపై కర్ణాటక (ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశంసలు కురిపించారు.అసలేం జరిగిందంటే.. శనివారం మధ్యాహ్నం ఇండిగో విమానం గోవా నుంచి దిల్లీకి బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే.. కాలిఫోర్నియాకు చెందిన జెన్నీ అనే ప్రయాణికురాలు అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో అదే విమానంలో ఉన్న ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలి వెంటనే స్పందించి.. జెన్నీకి సీపీఆర్ చేసి ప్రాణాల్ని నిలబెట్టారు. విమానం దిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత ఎయిర్‌పోర్టు సిబ్బంది సదరు ప్రయాణికురాలిని ఆస్పత్రికి తరలించారు. అప్పటి వరకు అంజలి ఆమెతోనే ఉన్నారు. వైద్యురాలి సేవను అభినందిస్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇది చాలా స్ఫూర్తిదాయకమని, అధికారం ఉన్నా లేకపోయినా అంజలి వంటి నేతలు నిజమైన ప్రజాసేవకు ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రతిఫలం ఆశించకుండా సాయం చేసేందుకు ఆమె ఎప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. ఇక కర్ణాటక కాంగ్రెస్ కూడా అంజలిని ప్రశంసిస్తూ పోస్టు పెట్టింది. నిజమైన ప్రజాసేవకు పదవి, హోదాతో సంబంధం లేదని పేర్కొంది. ఇక సామాజిక మాధ్యమాల్లో కూడా ఆమెను ప్రశంసిస్తూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

## ఢిల్లీ కాలుష్యం..రాందేవ్ బాబా సూచనలు వైరల్

విశ్వంభర, నేషనల్ బ్యూరో:



దేశ రాజధానిలో వాయు కాలుష్యం సమస్య తీవ్రమవడంతో యోగాగురువు రాందేవ్ బాబా చేసిన సూచనలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇప్పటికే దిల్లీ అంతటా కాలుష్య నియంత్రణ చర్యలను మరింత కఠినతరం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఓ కార్యక్రమంలో రాందేవ్ బాబా పలు సూచనలు చేయడం గమనార్హం. ఓ టీవీ కార్యక్రమానికి హాజరైన రాందేవ్ బాబా యోగా గురించి మాట్లాడుతూ.. ఎటువంటి వ్యాధులనైనా అధిగమించడానికి అది ఉపయోగపడుతుందన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో దుమ్ముతో సహజంగానే కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. శీతాకాలం వేళ దిల్లీలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని.. దీనిని ఎదుర్కోవడానికి అందరూ ఎయిర్ ప్యూరిఫైయర్ల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కానీ, అవి విలాసం కోసం ధనవంతులు చేసే దుబారా ఖర్చులుగా అభివర్ణించారు. కాలుష్య సమస్యను ఎదుర్కోవడానికి ప్రజలు ఇళ్లకు కర్టెన్లు వేసుకోవాలని సూచించారు. ఇంట్లో కూర్చొని కపాలభాతి వంటి ప్రాణాయామాలు చేస్తే ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ఆయన సూచనలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన న్యూ అహోబిలం ఆలయం.. భారత సంతతి వ్యక్తి మృతి



**విశ్వంభర, జోహన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికాలో నిర్మిస్తున్న న్యూ అహోబిలం ఆలయం కూలిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ దేశంలోని క్వాజులు నాటల్ ప్రావిన్స్‌లో నిర్మాణంలో ఉన్న నాలుగంతస్తుల న్యూ అహోబిలం ఆలయం శుక్రవారం కూలిపోయినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో 52 ఏళ్ల భారతసంతతి వ్యక్తి సహా నలుగురు మృతి చెందినట్లు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయం లో కార్మికులు, పలువురు ఆలయ అధికారులు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలాల కింద ఎంత మంది చిక్కుకున్నారనే విషయంపై ఇంకా స్పష్టతలేదన్నారు. దీంతో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. టన్నులకొద్దీ శిథిలాలు ఉండటంతో.. వాటిని తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రమాదంలో మరణించిన భారత సంతతి వ్యక్తిని ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండేగా గుర్తించినట్లు అధికారులు చెప్పారు. దాదాపు రెండేళ్లుగా ఆయన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

## మా పిల్లలు యూట్యూబ్ చూడటంపై ఇంట్లో ఆంక్షలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో:




సోషల్ మీడియా నేటి జీవనశైలిలో భాగమైంది. బోర్‌కొట్టినప్పుడు,ఒత్తిడిగా అనిపించినప్పుడు తమ స్నేహితులతో మాట్లాడడం కోసం, సమాచారాన్ని పంచుకోవడానికి చాలామంది టీనేజ్ పిల్లలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను విపరీతంగా ఉపయోగిస్తున్నారని పలు సర్వేలు చెబుతున్నాయి. పిల్లల్లో సోషల్ మీడియా వ్యసనంపై ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.సామాజిక మాధ్యమాల ను అధికంగా ఉపయోగించడం మంచిది కాదని.. అందుకేతమ పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతామని యూట్యూబ్ సీఈవో నీల్ మోహన్ తెలిపారు. వారాంతంలో తప్ప మిగిలిన రోజుల్లో యూట్యూబ్ సహా ఇతర సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలని తమ పిల్లలపై ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో తాను, తన భార్య చాలా కఠినంగా ఉంటామన్నారు. వారాంతంలో కొన్ని పరిమితులతో వాటిని వాడుకోవడానికి అవకాశం ఇస్తామన్నారు. అంతే కాకుండా పిల్లలు సోషల్ మీడియాను ఎందుకు, ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే విషయాలను గమనిస్తుండడం తల్లిదండ్రుల బాధ్యతల్లో ముఖ్యమైనదిగా తాను భావిస్తానన్నారు. పిల్లల అభ్యసనకు, నైతిక విలువలు నేర్చుకోవడానికి ఉపయోగపడే కంటెంట్‌ను సోషల్ మీడియాలో వారికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ ఆలోచనతోనే పిల్లలకు అవసరమైన సమాచారాన్ని అందించే 'యూట్యూబ్ కిడ్స్' యాప్‌ను 2015లో తాము రూపొందించినట్లు తెలిపారు. కాగా నీల్ మోహన్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## ఆస్ట్రేలియా బీచ్‌లో కాల్పులు.. 11 మంది మృతి!

విశ్వంభర, నేషనల్ బ్యూరో:



ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన బాండి బీచ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 (స్థానిక కాలమానం ప్రకారం) గంటలకు కాల్పులు చోటు చేసుకొన్నాయి. దీనిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులు ఉల్లాసంగా గడుపుతున్న సమయంలో బీచ్‌లలోకి ప్రవేశించిన ఇద్దరు గన్‌మెన్లు ఒక్కసారిగా ఫైరింగ్ మొదలుపెట్టడంతో వందల మంది పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు.ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం నల్లటి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు షాట్‌గన్స్‌తో సర్ఫ్ క్లబ్ పక్కనే ఉన్న పాదచారుల వంతెనపైకి చేరుకొని కాల్పులు జరిపారు. అక్కడ జరుగుతున్న ఒక ఈవెంట్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ప్రాథమిక సమాచారం మేరకు 11 మంది మృతి చెందినట్లు ఆస్ట్రేలియా పత్రికలు పేర్కొన్నాయి. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా దళాలు దుండగులను అదుపులోకి తీసుకొన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో క్షతగాత్రులను కాపాడేందుకు హెలికాప్టర్లు, 30 అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకొన్నాయి.

**యూదుల హనుక్కా కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకొని..**

బాండి బీచ్‌లో యూదులు జరుపుకొంటున్న హనుక్కా వేడకలను దుండగులు లక్ష్యంగా చేసుకొన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో స్థానిక యూదులు హాజరయ్యారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాను ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమిషనర్, న్యూసౌత్‌వేల్స్ ప్రీమియర్‌తో మాట్లాడినట్లు వెల్లడించారు.

**కాల్పులు జరుపుతున్న దుండగుడితో పోరాడిన పౌరుడు..**

బీచ్‌లోకి చొరబడిన దుండగులు విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్న వేళ ఓ స్థానికుడు వారిని అడ్డుకున్నాడు. ఓ సాయుధుడిని వెనుక నుంచి వెళ్లి బలంగా పట్టుకొని అతడి చేతిలో గన్‌ను లాగేసుకొన్నాడు. ఆ తర్వాత చేతికందిన వాటితో అతడిని తరిమికొట్టాడు. దీంతో అతడితో ఉన్న మరో దుండగుడు కూడా వెనక్కి తగ్గాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది.

**దుండగుడిని గుర్తించిన భద్రతా బలగాలు**

బాండి బీచ్‌లో కాల్పులకు తెగబడిన ఇద్దరు దుండగుల్లో ఒకరిని సిడ్నీ భద్రతా బలగాలు గుర్తించాయి. నిందితుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. వివిధ కోణాల్లో అతడిని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. గత కొన్నేళ్లలో పలు చోట్ల జరిగిన కాల్పులపైనా ఆరాతీస్తున్నట్లు అక్కడి మీడియా వెల్లడించింది. సిడ్నీలోని అక్రమ్ ఇంట్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.

## యూఎస్‌లోని బ్రౌన్ వర్సిటీలో కాల్పులు.. ఇద్దరి మృతి

విశ్వంభర, వాషింగ్టన్:



అమెరికాలో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. బ్రౌన్ విశ్వవిద్యాలయం రోడ్ ఐలాండ్‌లోని క్యాంపస్ లో పరీక్ష జరుగుతుండగా దుండగుడు కాల్పులకు పాల్పడ్డాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా.. మరో 8 మంది గాయపడ్డారు. దుండగుడి కోసం వెతుకుతున్నట్లు మేయర్ వెల్లడించారు. ఫోన్లను సైలెంట్‌గా ఉంచుకోవాలని, డోర్లను లాక్ చేసుకోవాలని విద్యార్థులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

విశ్వంభర, నేషనల్ బ్యూరో:



బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బిహార్ మంత్రి నితిన్ నబీన్ నియమితుల య్యారు.పార్టీ పార్లమెంటరీ బోర్డు ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇది వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.బిహార్‌లోని బాంకీపుర్ అసెంబ్లీ స్థానం నుంచి నితిన్ నబీన్ వరుసగా నాలుగు సార్లుఎమ్మెల్యేగా గెలిచారు.రహదారుల నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నారు. భాజపా ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 2020 జన వరిలో ఈ పదవిలో నియమితులయ్యారు. ఇప్పటికే ఆయన పదవీకాలం ముగిసినప్ప టికీ.. పొడిగించారు.

**ప్రధాని మోడీ శుభాకాంక్షలు..**

నితిన్ నబీన్‌కు ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. "కష్టపడి పనిచేసే కార్యకర్తగా నితిన్ నబీన్ గుర్తింపు పొందారు. ఆయనకు సంస్థాగతంగా గొప్ప అనుభవం ఉంది. బిహార్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా అద్భుతమైన రికార్డు ఆయన సొంతం. ఆయన పనితీరు రాబోయే కాలంలో బీజేపీ ను మరింత బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాను" అని ట్వీట్ చేశారు.

## ఏడాది తిరగకముందే.. మహాయుతి కూటమి బీటలు వారుతోంది: కాంగ్రెస్



**విశ్వంభర, ముంబయి:** మహారాష్ట్రలో అధికారంలో ఉన్న మహాయుతి కూటమిలో పొరపొచ్చాలు వచ్చినట్లు ప్రతిపక్ష కాంగ్రెస్ చెబుతోంది. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ వ్యవహార శైలి అందుకు మరింత బలం చేకూరుస్తోంది. మహాయుతి కూటమి నేతలంతా నాగ్‌పుర్‌లోని ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ స్మారక మందిరాన్ని ఆదివారం సందర్శించారు. అయితే, అజిత్ పవార్ గానీ, ఎన్సీపీ ఎమ్మెల్యేలుగానీ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు. ఆర్ఎస్ఎస్ శతవసంత వేడుకల్లోనూ ఎన్సీపీ పాలు పంచుకోలేదు. గతేడాది ఎన్సీపీకి చెందిన కేవలం ఇద్దరు నేతలు మాత్రమే ఆర్ఎస్ఎస్ మెమోరియల్‌ను సందర్శించారు.ఈ పరిణామాలపై విపక్షాలు విమర్శలకు పదునుపెడుతున్నాయి. ఏడాది తిరగక ముందే కూటమికి బీటలు బారుతున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకే కూటమి కార్యక్రమాలకు అజిత్‌పవార్, ఎన్సీపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉంటున్నారని చెబుతోంది. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరించకపోతే.. కూటమిలో ఎన్సీపీ కొనసాగలేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సచిన్ సావంత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ నేతల దృష్టి అంతా నగదు పంచడం, అధికారం సొంతం చేసుకోవడం, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ముంచేయడం పైనే ఉంటుందని విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ విమర్శలను ఎన్సీపీ తిప్పికొట్టింది. గతంలో మాదిరిగానే ఎన్సీపీ దృష్టి అభివృద్ధిపైనే ఉందని పేర్కొంది. సాహు మహరాజ్, బీఆర్ అంబేడ్కర్.. తదితర మహనీయుల ప్రగతిశీల భావజాలంతో ఎన్సీపీ నడుస్తోందని పునరుద్ఘాటించింది.

## కాంగ్రెస్ అపరాధాలను ప్రజలు క్షమించరు

విశ్వంభర, నేషనల్ బ్యూరో:




ప్రధాని నరేంద్ర మోడీని పదవి నుంచి దింపేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని బీజేపీ ఆరోపిం చింది. ఓటు చోరీని వ్యతిరేకిస్తూ.. దిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ మెగా ర్యాలీ చేపట్టిన విషయం తెలిసిందే. ర్యాలీలో ఆ పార్టీ కార్యకర్తలు ప్రధాని మోదీపై చేస్తున్న వివాదాస్పద నినాదాలు చూస్తుంటే.. ఆయనను పదవినుంచి దింపేయడమే కాంగ్రెస్ అసలు లక్ష్యమని స్పష్టమవుతోందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన ర్యాలీ అసలు ఎజెం డా ఇప్పుడు అర్థమయ్యిందని షెహజాద్ పూనావాలా పేర్కొన్నారు. వారు ర్యాలీ చేస్తున్నది ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)కు వ్యతిరేకంగా కాదని.. ప్రధాని మోదీని పదవి నుంచి తొలగించడానికేనని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఇప్పటి వరకు వందల సార్లు ప్రధానిపై విమర్శ లు చేశారని.. ఇకపై వారు చేస్తున్న తప్పులను ప్రజలు క్షమించరని అన్నారు. ప్రధాని మోదీ, ఆయన కుటుంబంపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నంతకాలం ప్రజలు వారిని తిరస్కరిస్తూనే ఉంటార న్నారు. ఓటు చోరీకీ వ్యతిరేకంగా దిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ మెగా ర్యాలీ చేపట్టిం ది. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలు, నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఓటుచోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ 5.50 కోట్ల మంది సంతకాలను సేకరించిందని, ర్యాలీ అనంతరం వీటిని రాష్ట్రపతికి అందించనున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు.

## మెస్సి ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాకు నో బెయిల్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి పర్యటన వేళ కోల్‌కతా స్టేడియంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అరెస్టయిన ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు దత్తాకు బెయిల్ లభించలేదు. అతడిని పోలీసులు 14రోజులు కస్టడీకి తీసుకున్నారు. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా మెస్సి తొలుత కోల్‌కతాకు వెళ్లాడు. అక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో చెప్పినదాని కంటే తక్కువ సమయం గడపడంతో అభిమానులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో స్టేడియంలో సీసాలు, ప్లాస్టిక్ కుర్చీలను మైదానంలోకి విసిరేశారు. ఫలితంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అనంతరం పోలీసులు రంగంలోకి దిగి నిరసనకారులను చెదరగొట్టారు. ఈ ఘటనకు సంబంధించి ఈవెంట్ నిర్వాహకుడు శతద్రును పోలీసులు ఎయిర్‌పోర్టులో అరెస్టుచేశారు. ఈవెంట్‌ను సరిగా నిర్వహించకుండా గందరగోళానికి కారణమయ్యాడన్నది అతడిపై ఆరోపణ. ఈ ఘటనపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. శతద్రును అరెస్టు అనంతరం బిధాన్నగర్ కోర్టులో హాజరు పరిచారు. ఈ క్రమంలో న్యాయస్థానం అతడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ 14 రోజుల కస్టడీకి అప్పగించింది. ఈవెంట్ ప్రణాళిక, అనుమతులు, కార్యచరణ నిర్ణయాలపై పోలీసులు అతడిని విచారించే అవకాశం ఉంది. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటి స్టేడియంను పరిశీలించింది. సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలించనున్నారు.

# నేడు శంషాబాద్‌కు ఏపీ సీఎం చంద్రబాబు..

**విశ్వంభర, అమరావతి:**
ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుహైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ మండలంలో పర్యటించనున్నారు. కన్హా శాంతివనాన్ని ఆయన సోమవారం సందర్శించనున్నారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి కన్హా శాంతివనం చేరుకుంటారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి. పటేల్ దాజీతో సమావేశం నిర్వహిస్తారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్ నెస్, మెడిటేషన్ సెంటర్ సహా యోగా కేంద్రాలను ఆయన పరిశీలిస్తారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను చంద్రబాబు నాయుడు సందర్శిస్తారు. ఆ తర్వాత శాంతి వనం వ్యవస్థాపకుడు దాజీ నివాసానికి వెళ్తారు. కాగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 1400 ఎకరాల్లో కన్హా శాంతివనాన్ని శ్రీరామచంద్ర మిషన్ అభివృద్ధి చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద మెడిటేషన్ సెంటర్‌ను ఈ ఆశ్రమం కలిగి ఉంది. 8 లక్షలకు పైగా వివిధ జాతుల వృక్షాలతో బయోడైవర్సిటీ కేంద్రంగా ఈ ఆశ్రమం పెద్దఎత్తున పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. మానవ వనరుల్ని గ్లోబల్ లీడర్లుగా తయారు చేసేందుకు ఈ ఆశ్రమం అధ్యక్షుడు దాజీ నేతృత్వంలో హార్ట్ ఫుల్ నెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లీడర్షిప్ నిర్వహిస్తోంది. కౌశలం పేరిట శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. కన్హా శాంతివనంలోని యోగా, మెడిటేషన్, వెల్ నెస్ సెంటర్లతో పాటు సుస్థిర వ్యవసాయ క్షేత్రాన్ని సైతం సీఎం చంద్రబాబు సందర్శించనున్నారు. అనంతరం ఆయన హెలికాప్టర్లో బయల్దేరి అమరావతికి తిరిగి చేరుకుంటారు. సోమ వారం మధ్యాహ్నం సచివాలయంలో అధికారులతో వేర్వేర ుగా సమీక్షా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించనున్నా అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు.



## గుడివాడలో భారీ అగ్నిప్రమాదం



**విశ్వంభర, గుడివాడ:** కృష్ణా జిల్లా గుడివాడలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. నెహ్రూ చౌక్ సెంటర్‌లోని అద్దేపల్లి కాంప్లెక్స్‌లో భారీగా మంటలు చెలరేగాయి. తొలుత సెల్‌ఫోన్ దుకాణంలో వచ్చిన మంటలు.. క్రమంగా మిగతా షాపులకు వ్యాపించాయి. ఇదే కాంప్లెక్స్‌లో జూనియర్ కళాశాల, ఎస్‌బీఐ శాఖలు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరిశీలించారు. ప్రమాదంతో సుమారు రూ.కోటి ఆస్తి నష్టం జరిగినట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి ఆంజనేయులు తెలిపారు.

## అంబటికి అది మంచి పద్ధతి కాదు: కేంద్రమంత్రి పెమ్మసాని

**విశ్వంభర, గుంటూరు:**



ఎమ్మెల్యేలు డమ్మీలని మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. గుంటూరులో పర్యటించిన ఆయన అంబటి అలా మాట్లాడటం సరికాదన్నారు. వైసీపీ అధినేత జగన్ ఆదేశాలతో అంబటి అలా మాట్లాడాడని, దాన్ని తాను అర్థం చేసుకోగలనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అంబటితో పాటు వైసీపీ నేతలకు చేసిన కామెంట్లను తాను స్పందించాల్సిన అవసరం లేదన్నారు. గుంటూరులో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కానీ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై అంబటిలా తాను మాట్లాడాలేనన్నారు. రెండు సంవత్సరాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి తొలగింపు కోసం ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి తొలగింపు కొంచెం జఠిలమైన సమస్యేనని చెప్పారు. ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేసేలోపే మిగిలిన బ్రిడ్జిని సైతం తొలగిస్తామని చెప్పారు. శంకర్ విలాస్ సెంటర్ నిర్మాణం వల్ల నష్టపోయిన స్థానికులకు పరిహారం చెల్లిస్తున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు సిద్ధం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

**విశ్వంభర, అమరావతి బ్యూరో:**



అవుకు రిజర్వాయర్ లీకేజీ అరికట్టడానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రకటించారు. అవుకు రిజర్వాయర్ ను ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్ లో లీకేజీ సమస్య ఉందన్నారు. ప్రభుత్వం సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే కోటి రూ పాయల వరకు నిధులను విడుదల చేసి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. రానున్న పదిహేను ఇరవై రోజుల్లో పనులను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. లీకేజీలను పూర్తి స్థాయిలో గుర్తించేందుకు నిపుణులు పని చేస్తున్నారు. వారు రిజర్వాయర్ అంతటా గాలించి లీకేజీలను గుర్తిస్తారన్నారు. లీకేజీలు నిర్ధారణ అయిన తరువాత వాటిని కాంక్రీట్ తో ఫిట్ చేస్తున్నారని వివరించారు.

**లీకేజీలున్న మాట వాస్తవమే..**

గత పదిహేనేళ్లుగా అవును రిజర్వాయర్ లో చిన్న చిన్న లీకేజీలు ఉన్నమాట వాస్తవమేనని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. నాడు ఈ లీకేజీలపై దృష్టి పెట్టకపోవడం వల్ల నేడు ప్రమాదకరంగా మారిన పరిస్థితి నెలకొందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్ ఉన్న పరిస్థితి వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం ముంచుకొస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారన్నారు. ఇది ప్రజల భద్రతకు సంబంధించిన అంశం అని.. లీకేజీలను పూర్తి స్థాయిలో అరికడతామని.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని మంత్రి భరోసానిచ్చారు. ఇంకా వేరే లీకేజీలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా పరిశీలిస్తున్నామని తెలియజేశారు. రిజర్వాయర్ కట్ట కూడా కొద్దిగా కుంగిన క్రమంలో నెలాఖరులోపు దాన్ని బలోపేతం చేస్తామని ప్రకటించారు. లీకేజీలను అశ్రద్ధ చేయకూడదని ఇప్పటికే తాను రెండుసార్లు స్వయంగా వచ్చి పర్యవేక్షించానని వెల్లడించారు. ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో అవుకు రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాని తెలిపారు.

## పవన్ కల్యాణ్‌కు ఆత్మకూరు ప్రజలు రుణపడి ఉంటారు: మంత్రి ఆనం



**విశ్వంభర, నెల్లూరు:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆత్మకూరు ప్రజలంతా రుణపడి ఉంటారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 10 పంచాయతీ భవనాలకు డిప్యూటీ సీఎం నిధులు మంజూరు చేశారని తెలిపారు. అనేక అభివృద్ధి పనులకు అడిగిన వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఆత్మకూరు ఆసుపత్రిని 250 పడకలకు పెంచామని, భవన నిర్మాణం జరుగుతోందని వివరించారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం. కర్నూలులో దేవాదాయశాఖ జోనల్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నాం. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని.. అవినీతి, అక్రమాలు, అప్పుల్లో ముంచింది. సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే దిక్కులేదు. రూ. 120 కోట్లతో సోమశిల అభివృద్ధి పనులు చేస్తున్నాం. గత ప్రభుత్వంలో ఉద్యోగులకే రూ.32వేల కోట్ల బకాయిలు పెట్టారు. ఏడాదిగా వారి బకాయిలు రూ.12వేల కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది. జగన్ మాయలో పడి బొత్స మాట్లాడటం దురదృష్టకరం" అని ఆనం రామనారాయణరెడ్డి అన్నారు.

## ప్రజల అర్జీలు.. స్పాట్‌లోనే మంత్రి పరిష్కారం

**విశ్వంభర, బనగానెపల్లె:**



ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను ఆయన స్వయంగా స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించానని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

## టీడీపీలోకి చేరికలు

**విశ్వంభర, శ్రీకాకుళం:**



టీడీపీలోకి వైసీపీ నేతలు వరుస కట్టారు. మంచి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, కూటమి ప్రభుత్వ పాలనను బలపరుస్తూ ప్రజా సేవలో భాగస్వాములయ్యేందుకు ముందుకొస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రాజకీయాల్లో ఓ శుభ పరిణామం చోటు చేసుకుంది. కోటపాడు, వడ్డితాడ్ర పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి వచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో పసుపు కండువాలను కప్పుకున్నారు. నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో చేరికల కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వైసీపీ శ్రేణులకు మంత్రి స్వయంగా కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రగతిశీల పాలన, సంక్షేమ కార్యక్రమాలను విశ్వసించి వైసీపీ నేతలు చేరడం హర్షణీయమన్నారు. కోటపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ అప్పలరాజు, రెడ్డి అప్పన్న వంటి కీలక వ్యక్తులు పార్టీలో చేరడం కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్నిచ్చిందన్నారు. అభివృద్ధిని కాంక్షించే ప్రజలంతా తండ్రి సమానులైన చంద్రబాబు నాయకత్వాన్ని ఆశిస్తున్నారు అనడానికి ఈ చేరికలే నిదర్శనం అని ప్రకటించారు. ?కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నాం అన్నారు. అందరూ కష్టపడి పని చేస్తే, ఆయా గ్రామాల అభివృద్ధికి తాను మంత్రిగా తన వంతు పూర్తి సహకారం ఎప్పుడూ అందిస్తానని భరోసానిచ్చారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## వాట్సప్‌లో జిల్లా కలెక్టర్‌కు.. నెల్లూరు మేయర్ రాజీనామా..



**విశ్వంభర, నెల్లూరు:** మేయర్ పదవికి పొట్లూరు స్రవంతి రాజీనామా చేశారు. రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఆమె ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం స్వయంగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు రాజీనామా పత్రాన్ని అందిస్తానని చెప్పారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో వాట్సప్‌లో పంపారు. వాట్సప్ ద్వారా రాజీనామా పంపడంతో జిల్లా కలెక్టర్ ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 18న అవిశ్వాస తీర్మాన సమావేశం జరగనున్న నేపథ్యంలో రాజీనామా చేస్తున్నట్లు స్రవంతి ప్రకటించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 54మంది కార్పొరేటర్లు ఉండగా.. అందరూ వైసీపీవారే. వారిలో ఒకరు ఇప్పటికే రాజీనామా చేశారు. మేయర్ కాకుండా.. మిగిలిన 52 మందిలో 42 మంది సార్వత్రిక ఎన్నికల తర్వాత టీడీపీలో చేరారు.

## అనకాపల్లి జిల్లాలో 'బార్క్' విస్తరణ

**విశ్వంభర, అమరావతి:** అనకాపల్లి జిల్లాలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌ను విస్తరించాలని సంస్థ నిర్ణయించింది. అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే 3వేల ఎకరాల్లో ఉన్న తన పరిశోధన, అభివృద్ధి ప్రాంగణాన్ని విస్తరించాలని బార్క్ యోచిస్తోంది. ఇందు కోసం 148.15 హెక్టార్లు (366 ఎకరాలు) భూమి కేటాయించాలని ఏపీ ప్రభుత్వాన్ని సంస్థ కోరింది.




## జనసేనలోనూ షురూ.. ఢీ అంటే ఢీ అంటున్న నేతలు

**విశ్వంభర, గూడూరు:**



జనసేనపార్టీలోనూ నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. టీడీపీలోనే అనుకుంటే పవన్ పార్టీలోనూ ఏదో ఒకచోట వర్గపోరు బయటపడుతోంది. అయితే అవి అధిష్టానం వరకు వెళ్లకపోవడంతో ఇటీవల ఈ పంచాయితీలు అధికమయ్యాయి. ఇటీవల గూడూరు నియోజకవర్గంలో జనసేన నేతలు, కార్యకర్తల మధ్య చెలరేగిన ఘర్షణతో పలువురికి గాయాలై ఆస్పత్రి పాలయ్యారు. ఈ వివాదాన్ని మర్చిపోకవముందే కృష్ణా జిల్లా పెనమలూరులోనూ జనసేన నేతల మధ్య వర్గ పోరు బయటపడింది. జనసేన నాయకుడు గణేష్‌పై మరో వర్గం నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. స్థానిక రైతు బజార్‌లో షాపులు, ఇసుక వ్యాపారంతో డబ్బులు సంపాదించాడని గణేష్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాదు గత సంక్రాంతి సమయంలో కోడిపందాలు నిర్వహించాడని, ఆధారాలతో గణేష్‌పై జనసేన ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీని రోడ్డు మీదకు తీసుకొచ్చాడని, గణేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అంశం పెనమలూరు రాజకీయాల్లో చర్చగా మారింది. మరి జనసేన పార్టీ అగ్రనాయకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి.

## పిన్నెల్లి సోదరులపై ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న హాట్ కామెంట్స్

**విశ్వంభర, అమరావతి:**



జంట హత్యల కేసులో నిందితులుగా ఉన్న పిన్నెల్లి సోదరులపై ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న హాట్ కామెంట్స్ చేశారు. సోదరులను ఉద్దేశిస్తూవిమర్శల వర్షాన్నికురిపించారు. పిన్నెల్లి సోదరులు నరహంతకులని ఆరోపించారు. పేద ప్రజలంటే పిన్నెల్లి సోదరులకు చులకన భావన అని పేర్కొన్నారు. వారు చేసిన అరాచకాలకు అంతుపొంతు లేదున్నారు. వైసీపీ హయాంలో అధికారాన్ని దుర్వినియోగం చేశారన్నారు. పిన్నెల్లి సోదరుల అరాచకాలకు జగన్ దే పూర్తి బాధ్యతని స్పష్టం చేశారు. వారి అరాచకం ఎంతలా ఉందంటే గతంలో తనపైన, బోండా ఉమపైన కూడా దాడులు చేయించారని గుర్తు చేసుకున్నారు. వైసీపీ నేత తురకా కిషోర్ పై హత్యాయత్నం వెనుక కూడా పిన్నెల్లి సోదరులు ఉన్నారని ఆరోపణలు గుప్పించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే పిన్నెల్లి సోదరుల అరెస్టులు జరిగాయని స్పష్టం చేశారు. మాజీ సీఎం వైయస్ జగన్ గురించి మాట్లాడుతూ.. జగన్ మళ్లీ సీఎం కావడం కలేనని అన్నారు. వైసీపీ హయాంలో జరిగిన నేరాలు, ఘోరాలు, స్కాములను చూసి ప్రజలు ఆ పార్టీ పట్ల వ్యతిరేకత పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తుందని.. జగన్ సీఎం అవుతారని కలలు కనడం మానుకోవాలని హితవు పలికారు.

## మదనపల్లెలో వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉత్తరాఖండ్ సీఎం



**విశ్వంభర, మదనపల్లె:** ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ అన్నమయ్య జిల్లా మదనపల్లెలో పర్యటించారు. పట్టణంలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద పుష్కర్‌సింగ్ ధామీకి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ తదితరులు ఉన్నారు. మదనపల్లెలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఉత్తరాఖండ్ సీఎం పాల్గొననున్నారు.

## డివైడర్‌ను ఢీకొట్టి లారీ బోల్తా

**విశ్వంభర, కాకినాడ :**

సామర్లకోట కాకినాడ కెనాల్ రోడ్డు రైల్వే గూడ్స్ షెడ్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి డివైడర్‌ను లారీ ఢీకొట్టింది. అనంతరం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు.

# సౌతాఫ్రికాపై భారత్ ఘన విజయం



ధర్మశాల: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని భారత్ 15.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టీ20 డిసెంబర్ 17న లఖ్‌నవూలో జరగనుంది.

**ఆరంభంలో దూకుడు..**

స్వల్ప లక్ష్య ఛేదనలో టీమ్‌ఇండియాకు శుభారంభం దక్కింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (35బీ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) తనదైన శైలిలో దూకుడుగా ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టాడు. అతడికి జతగా శుభ్‌మన్ గిల్ (28బీ 28 బంతుల్లో 5 ఫోర్లు) కూడా ఆచితూచి ఆడాడు. దీంతో 5 ఓవర్లలోనే భారత్ వికెట్ నష్టపోకుండా 60 పరుగులు రాబట్టింది. సగం ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగిస్తుందేమోనని అభిమానులు భావించారు. కానీ, ఆ తర్వాత సౌతాఫ్రికా బౌలర్లు పుంజుకుని కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో స్కోరు బోర్డు వేగం తగ్గింది. అభిషేక్, గిల్, సూర్యకుమార్ యాదవ్ (12) ఔట్ కావడంతో.. తిలక్ వర్మ (25లిబీ 34 బంతుల్లో 3 ఫోర్లు), శివమ్ దూబె (10లిబీ 4 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) మరో వికెట్ పడనీయకుండా మ్యాచ్‌ను ముగించారు. సఫారీ బౌలర్లలో లుంగి ఎంగిడి, మార్కో యాన్సెన్, కార్బిన్ బాష్ తలో వికెట్ తీశారు.

**అదరగొట్టిన భారత బౌలర్లు..**

రెండో మ్యాచ్‌లో విఫలమైన భారత బౌలింగ్ విభాగం ఈసారి మాత్రం చెలరేగింది. సౌతాఫ్రికా బ్యాటర్లలో మార్‌క్రమ్ (61) ఒక్కడే రాణించాడు. డొనావన్ ఫెరీరా (20), అన్రిచ్ నోకియా (12) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. శివమ్ దూబె, హార్దిక్ పాండ్య తలో వికెట్ తీసుకున్నారు.

# యశస్వి జైస్వాల్ సూపర్ సెంచరీ.. ముంబయి విజయం




**విశాఖ పట్నం:** విశాఖపట్నం వేదికగా.. భారత జట్టు , దక్షిణాఫ్రికా మధ్య ఇటీవల జరిగిన మూడో వన్డేలో యశస్వి జైస్వాల్ ఈ ఫార్మాట్లో తన తొలి సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. అదే ఫామ్‌ను కొనసాగిస్తూ..సయ్యద్ ముస్తాక్ అలీట్రోఫీలోభాగంగా హరియాణా, ముంబయికి మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తుపాన్ ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 48 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. చివరికి 50 బంతుల్లో 101 పరుగుల (16 ఫోర్లు, 1 సిక్స్) వద్ద ఔటయ్యాడు. సర్ఫరాజ్ ఖాన్ (64బీ 25 బంతుల్లో, 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా వేగంగా పరుగులు రాబట్టాడు. దీంతో హరియాణా నిర్దేశించిన 235 పరుగుల భారీ లక్ష్యాన్ని ముంబయి మరో 15 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. అంతకు ముందు టాస్ గెలిచిన ముంబయి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ ప్రారంభిన హరియాణా నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. కెప్టెన్, ఓపెనర్ అనికేత్ కుమార్ (89బీ 42 బంతుల్లో, 10 ఫోర్లు, 6 సిక్స్‌లు), నిశాంత్ సింధు (63లిబీ 38 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. సమంత్ జఖర్ (31బీ 14 బంతుల్లో, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సుమిత్ కుమార్ (16లి, 4 బంతుల్లో, 4 ఫోర్లు) తాను ఎదుర్కొన్న నాలుగు బంతులను బౌండరీకి తరలించాడు. ముంబయి బౌలర్లలో సాయిరాజ్ పాటిల్ ఒక్కడే 2 వికెట్లు తీసుకున్నారు. మిగతా బౌలర్లు వికెట్లు తీసుకోవడంలో విఫలమయ్యారు. అనంతరం ఛేదనకు దిగిన ముంబయి జట్టులో యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ రాణించారు. వీరు రెండో వికెట్‌కు కేవలం 37 బంతు ల్లోనే 88 పరుగులు జతచేశారు. అజింక్య రహానే (21బీ 10 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. అంగ్క్రిష్ రఘువంశీ (7), సూర్యాంశ్ షిడ్జే (13), కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ (2) బ్యాటింగ్‌లో విఫల మయ్యారు. సాయిరాజ్ పాటిల్ (8లి), అథర్వ అంకోలేకర్ (10లి) పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో ముంబయి జట్టు 17.3 ఓవర్ల లో 6 వికెట్లు కోల్పోయి 238 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. హరియాణా బౌలర్లలో సమంత్ జఖర్ 2, అన్షుల్ కాంబోజ్, ఇషాంత్ భరద్వాజ్, సుమిత్ కుమార్, అమిత్ రాణా తలో వికెట్ తీసుకున్నారు.

# పాకిస్తాన్‌ను చిత్తుగా ఓడించిన యువ భారత్

విశ్వంభర, స్పోర్ట్స్:



అండర్-19 ఆసియా కప్‌లో భారత్ వరుసగా రెండో విజయం అందుకుంది. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో యువ భారత్ 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 46.1 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్థాన్.. భారత బౌలర్ల ధాటికి 41.2 ఓవర్లలో 150 పరుగులకే ఆలౌటైంది. హుజైఫా అహ్సాన్ (70బీ 83 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణించాడు. ఫర్హాన్ యూసుఫ్ (23), ఉస్మాన్ ఖాన్ (16) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 3, చౌహాన్ 3, కిషన్ కుమార్ సింగ్ 2, ఖిలాన్ పటేల్, వైభవ్ సూర్యవంశీ ఒక్కో వికెట్ పడగొట్టారు.భారత బ్యాటర్లలో అరోన్ జార్జి (85బీ 88 బంతుల్లో, 12 ఫోర్లు, 1 సిక్స్), కాన్షిక్ చౌహాన్ (46, 46 బంతుల్లో, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆయుష్ మాత్రే (38, 25 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. అభిజ్ఞాన్ కుందు (22). యూఏఈతో మ్యాచ్‌లో సూపర్ సెంచరీ చేసిన వైభవ్ సూర్యవంశీ (5) ఈ మ్యాచ్‌లో విఫలమయ్యాడు. పాక్ బౌలర్లలో మహ్మద్ సయ్యమ్ 3, అబ్దుల్ సుభాన్, నికబ్ సాఫిక్ చెరో రెండు, అహ్మద్ హుస్సేన్, అలీ రజా తలో వికెట్ తీసుకున్నారు.

# 'శత'క్కొట్టిన హేమంత్ రెడ్డి.. పంజాబ్‌పై ఆంధ్ర విజయం



**విశ్వంభర, స్పోర్ట్స్:** సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సూపర్ లీగ్ దశలో ఆంధ్ర తొలి విజయం సాధించింది. గ్రూప్ ఎలో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో ఆరంభంలో తడబడిన ఆంధ్ర ఆలస్యంగా పుంజుకుని అద్భుత విజయం అందుకుంది. శ్రీకర్ భరత్ (1), అశ్విన్ హెబ్బార్ (4), నితీశ్ కుమార్ రెడ్డి (0) నిరాశపర్చడంతో 12 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. రికీ భుయ్ (15), పైలా అవినాష్ (13) కూడా త్వరగా పెవిలియన్ చేరడంతో 56 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి ఘోర ఓటమి దిశగా పయనించింది. కానీ, ఈ దశలో హేమంత్ రెడ్డి (109లిబీ 53 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు), ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (53లిబీ 35 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) గొప్పగా పోరాడి జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు.తొలుత పంజాబ్ బ్యాటర్లలో హర్నూర్ సింగ్ (42, 30 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అన్మోల్‌ప్రీత్ సింగ్ (47, 27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), సలీల్ అరోడా (42, 22 బంతుల్లో 5 ఫోర్లు), రమణ్‌దీప్ సింగ్ (43, 18 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (20) పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ రాజు, సౌరభ్ కుమార్, ప్రథ్వీ రాజ్ తలో వికెట్ పడగొట్టారు.ఈ ఇన్నింగ్స్‌తో టీ20ల్లో ఆంధ్ర తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా హేమంత్ రెడ్డి నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డు రికీ భుయ్ (108) పేరిట ఉండేది. ఈ మ్యాచ్‌లో హేమంత్ బౌండరీల ద్వారా 86 పరుగులు చేశాడు. దీంతో రికీ భుయ్ (80)ని అధిగమించి టీ20ల్లో ఒక ఇన్నింగ్స్‌లో బౌండరీలతో ఎక్కువ పరుగులు చేసిన ఆంధ్ర ప్లేయర్‌గా హేమంత్ నిలిచాడు.

# సచిన్.. మెస్సి.. నెంబర్ 10 జెర్సీ!




**విశ్వంభర, స్పోర్ట్స్:**

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సిముంబయి పర్యటనలో అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది. భారత ప్రజలు క్రికెట్ దేవుడిగా పిలిచే సచిన్ తెందూల్కర్ , ఫుట్‌బాల్ మేటి ఆటగాడు లియోనెల్ మెస్సి ఒకే వేదికపై కనిపించి క్రీడాభిమానులకు కనువిందు చేశారు. అంతేకాదు వీరిద్దరి జెర్సీ నెంబర్ 10 కావడం విశేషం. ఈ సందర్భంగా వాంఖడే స్టేడియంలో మెస్సికి సచిన్ ఓ అపురూపమైన కానుక అందించారు. 2011 వరల్డ్‌కప్ ఫైనల్‌లో తన జెర్సీని మెస్సీకి బహూకరించారు. మెస్సీ కూడా తాను సాకర్ ప్రపంచకప్‌ల్ గోల్ కొట్టిన ఫుట్‌బాల్‌ను సచిన్‌కు కానుకగా ఇచ్చారు. ఈ ఇద్దరు దిగ్గజాలను చూసి స్టేడియం హోరెత్తింది. తనకు ఈ వేదిక ఎంతో ప్రత్యేకమైందని సచిన్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# చరిత్ర సృష్టించిన భారత్.. తొలిసారిగా ప్రపంచకప్ టైటిల్ కైవసం



విశ్వంభర, స్పోర్ట్స్ : స్క్వాష్‌లో భారత్ చారిత్రాత్మక విజయం సాధించింది. తొలిసారిగా స్క్వాష్ వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో భారత జట్టు బలమైన హాంకాంగ్‌ను ఓడించి టైటిల్ దక్కించుకుంది. చెన్నయ్‌లో ఆదివారం జరిగిన టైటిల్ పోరులో హాంకాంగ్‌పై 3-0 తేడాతో విజయం సాధించింది. టోర్నీ ఆద్యంతం భారత జట్టు సంచలన ప్రదర్శన చేసింది. ఒక్క మ్యాచ్ కూడా కోల్పోలేదు. ఫైనల్‌లోనూ అదే జోరు కొనసాగించింది. ముందుగా జోష్న చినప్ప శుభారంభం చేసింది. ఉమెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో లీ కా యిపై 7-3, 2-7,7-5, 7-1తేడాతో గెలిచింది. ఆ తర్వాత మెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో అభయ్ 7-1, 7-4, 7-4తో అలెక్స్ లావుపై ఏకపక్ష విజయం సాధించడంతో భారత్2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక మరో ఉమెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో అనాహత్ సింగ్ 7-2, 7-2, 7-5తో టొమాటో హెూను చిత్తు చేయడంతో భారత్ విజయం లాంఛనమైంది.

# డబ్ల్యూడబ్ల్యూఈకి జాన్ సెనా గుడ్ బై..

## ఓటమితో సుదీర్ఘ కెరీర్‌ను ముగించిన దిగ్గజ రెజ్లర్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్(డబ్ల్యూడబ్ల్యూఈ) చరిత్రలో ఓ శకం ముగిసింది. ప్రొఫెషనల్ రెజ్లింగ్ సూపర్‌స్టార్ జాన్ సెనా తన సుదీర్ఘమైన్ కెరీర్‌కు ముగింపు పలికాడు. గతేడాదే రిటైర్మెంట్‌పై ప్రకటన చేసిన అతను ఆదివారం తన చివరి మ్యాచ్ ఆడేశాడు. జాన్ సెనా తన రెజ్లింగ్ ప్రయాణాన్ని ఓటమితో ముగింపు పలకడం అభిమానులను కాస్త నిరాశకు గురిచేసింది. వాషింగ్టన్ డీ.సీలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో జాన్ సెనాపై గుంథర్ విజయం సాధించాడు. రింగ్‌లో అతన్ని చివరి సారిగా చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. బౌట్ ఆద్యంతం ఫ్యాన్స్ జాన్ సెనాకు మద్దతుగా నిలిచారు. ఆరంభంలో గుంథర్‌పై సెనా పిడి గుద్దులతో విరుచుకుపడ్డాడు. అయితే మ్యాచ్ సాగుతున్నకొద్ది గుంథర్ ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చాడు. ఆఖర్లో సెనా భుజాన్ని లక్ష్యంగా చేసుకుని పట్టు బిగించడంతో అతని విజయం లాంఛన మైంది. మ్యాచ్ అనంతరం ప్రేక్షకులందరూ జాన్ సెనాకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. తన షూస్‌ను రింగ్‌లోనే ఉంచి అక్కడి నుంచి నిష్క్రమించిన అతను 'యు కాంట్ సీ మీ'అని వ్యాఖ్యానించాడు. 48 ఏళ్ల జాన్ సెనా 24 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించాడు. 17సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచాడు. అత్యధిక సార్లు వరల్డ్ టైటిల్ సాధించింది అతనే కావడం విశేషం. ఐదుసార్లు యునైటెడ్ స్టేట్స్ చాంపియన్‌షిప్, నాలుగుసార్లు ట్యాగ్ టీమ్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచాడు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ చాంపియన్ నిలిచాడు. మొత్తంగా డబ్ల్యూడబ్ల్యూఈపై తనదైన ముద్ర వేసిన జాన్ సెనా భారత్‌లో కూడా భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించిన విషయం తెలిసిందే.


DECEMBER
15
ఇంచార్జ్ - కాంగ్రెస్ పార్టీ ఎల్.బి.నగర్ నియోజకవర్గం
గౌ॥ శ్రీ మధుయాష్కీ గౌడ్ అన్న గారికి
హృదయపూర్వక
జన్మదిన
శుభాకాంక్షలు
దాము మహేందర్ యాదవ్
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు